RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 37 | ఆదివారం, మార్చి 03, 2024 | పేజీలు : 4

## 15 నుంచి ఒంటిపూట బడులు.. విద్యాశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎండల తీవ్ర పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండలు మండుతున్నాయి. దీంతో తెలంగాణలో ఒంటి పూట బడులకు వేళయ్యింది. రాష్ట్రంలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో సర్కారు, ప్రైవేటు స్కూళ్లలో ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు సమాచారం. ఇక, విద్యార్థులకు మధ్యాహ్నం 12.45 గంటల కల్లా మధ్యాహ్న భోజనం అందించనున్నారు.

## 195 మంది ఎంపి అభ్యర్థులతో...

# బిజెపి తొలి జాబితా విడుదల




**న్యూఢిల్లీ మార్చి, 2 :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బిజెపి ఎంపి అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. 195మంది అభ్యర్థుల పేర్లను బిజెపి జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే ప్రకటించారు. వారణాసి నుంచి మరోసారి ప్రధాని మోడీ పోటీ చేయనున్నట్లు తెలిపారు. తొలి జాబితాలో 28 మంది మహిళలు అవకాశం ఇవ్వగా.. 47మంది యువతకు ఛాన్స్ ఇచ్చామని ఆయన చెప్పారు. 34 మంది మంత్రులకు తొలి జాబితాలోనే చోటు కల్పించారు. ఇక, తెలంగాణ నుంచి 9 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా%ొా% ఉత్తర్ ప్రదేశ్ లో 51, బెంగాల్ 20, మధ్యప్రదేశ్ 24, గుజరాత్ 15, రాజస్థాన్ 15, కేరళ 12, అసోం 11, ఝూర?ండ్ 11, ఛత్తీస్ గఢ్ 11, ఢిల్లీ 5 సీట్లు, జమ్మూ కశ్మీర్ 2, ఉత్తరాఖండ్, 2, అరుణాచల్ ప్రదేశ్, గోవా 1, త్రిపుర 1, అండమాన్ నికోబార్ 1, డామన్ డయ్యూ 1 స్థానాలకు అభ్యర్థులను వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి..

# కీలక ఆదేశం...!



**హైదరాబాద్ మార్చి, 2:** ఈ నెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ సర్కారు ప్రారంభించనున్నది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇండ్లు లేని అర్హులందరికీ పథకాన్ని వర్తింపజేయాలని.. అందుకు అనుగుణంగా వెంటనే విధివిధానాలను తయారు చేయాలని సూచించారు. పథకంలో ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం చేయనున్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు అందించనున్నారు. అందుకు సంబంధించిన నిబంధనలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారులతో సీఎం సమీక్షించారు. సమావేశంలో సీఎంతో పాటు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 9 మంది ఎంపి అభ్యర్థులను ప్రకటించిన బిజెపి



**హైదరాబాద్ మార్చి, 2 :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎంపి అభ్యర్థుల తొలి జాబితాను బిజెపి విడుదల చేసింది. తొలి జాబితాలో 195మంది అభ్యర్థుల పేర్లను బిజెపి జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే ప్రకటించారు. ఇక, తెలంగాణలో 9 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వరంగల్, మహబూబ్ నగర్, మహబూబాబాద్, ఖమ్మం, మెదక్, ఆదిలాబాద్, పెద్దపల్లి, నల్గొండ స్థానాలను పెండింగ్ ఉంచారు.

**ఎంపి అభ్యర్థులు వీరే:**

కరీంనగర్ – బండి సంజయ్ కుమార్, సికింద్రాబాద్ – కిషన్ రెడ్డి
చేవెళ్ల– కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జహీరాబాద్– బిబి పాటిల్
నాగర్ కర్నూల్– పి భరత్, భువనగిరి– బూర నర్సయ్య గౌడ్
నిజామాబాద్– ధర్మపురి అరవింద్, మల్కాజ్ గిరి– ఈటల రాజేందర్
హైదరాబాద్–మాధవిలత



## నేడు పల్స్ పోలియో!

**హైదరాబాద్ మార్చి, 2 :** చిన్నారుల నిండు ప్రాణాన్ని కాపాడేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. పోలియో రహిత దేశంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నేడు దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. మార్చి 3న ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారు. దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ డ్రైవ్ నిర్వహించబ డుతుంది. ఈ కార్యక్రమం కోసం ఆరోగ్య శాఖ అధికారులు వేల సంఖ్యలో పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలకు అందుబాటులో మొబైల్ బూత్‌లు కూడా ఉన్నాయి.

## రిజర్వాయర్లలో త్రాగునీటి నిల్వలు...

# నిరంతరం పర్యవేక్షించాలి



**- వేసవిలో గ్రామాల ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలి**

**- మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బతింటే వెంటనే పనులు చేపట్టి నీటి సరఫరా జరగాలి: మంత్రి సీతక్క**

**హైదరాబాద్ మార్చి, 2 :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తాగునీటి వనరులైన రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటి నిలువలను అధికా రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. శనివారం మిషన్ భగరథ ఇంజనీర్ ఇన్ చీప్ ఎర్రమంజిల్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా త్రాగునీటి సరఫరా పరిస్థితిపై అధికా రులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రిజర్వాయర్లు నదుల వంటి తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్రంలోని అన్ని మారుమూల గ్రామాలు, ఆవాసాలు, తండాలు, గూడాలకు ప్రతిరోజు తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని ఇంజనీర్లను ఆదేశించారు. ప్రత్యేకంగా పూర్వపు అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని పంపుసెట్ల సమస్యను త్వరితగా పరిష్కరించి వేసవిలో ఎటు వంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పైపులైన్లు పగిలిపోయిన లీకైన వెంటనే వాటిని సరిదిద్ది నీటి సరఫరాను అదే రోజు పునరుద్ధరించాలి, ఈ విషయంలో ఎటువంటి ఆలస్యం ఉండకూడదని హెచ్చరించారు. ప్రత్యేక అభివృద్ధి నిధులలో తాగునీటి అవసరాల నిమిత్తం ప్రతి నియోజకవర్గానికి సిఎం రేవంత్‌రెడ్డి ఒక కోటి రూపాయలు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మిషన్ భగీరథ ఇంజనీర్లు క్షేత్రస్థాయి అవసరాలను గమనించి జాగ్రత్తగా వినియోగించుకోవాలని, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ వేసవిలో తరచూ సమీక్షలు నిర్వహించాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. చీఫ్ ఇంజనీరింగ్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. మండల స్థాయి మిషన్ భగీరథ ఇంజనీర్లు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలి. ఈ సమావేశంలో పంచాయతీ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇంజనీరింగ్ చీఫ్ కృపాకర్ రెడ్డి తో పాటు ఇతర మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# మమత ప్రభుత్వంపై మోడీ ఫైర్



కృష్ణనగర్ (పశ్చిమ బెంగాల్): ప్రధాని నరేంద్ర మోడీ శనివారం మమతా బెనర్జీ ప్రభుత్వంపై మళ్లీ విరుచుకు పడ్డారు. మమత ప్రబుత్వం 'అణచివేత, అనువంశిక రాజకీయాలు, వంచనకు' ప్రతీక అని మోడీ విమర్శించారు. పథకాలను కుంభకోణాలుగా మలచడంలో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) 'పరిపక్వత' సాధించిందని ఆయన ఆరోపించారు. నాడియా జిల్లా కృష్ణనగర్‌లో ఒక ర్యాలీలో మాట్లాడిన ప్రధాని మోడీ పశ్చిమ బెంగాల్‌లో గల మొత్తం 42 లోక్‌సభ సీట్లను గెలవాలని బిజెపికి ఆశావహ లక్ష్యాన్ని నిర్దేశించారు. పశ్చిమ బెంగాల్ పురోగతి, దేశ ప్రగతికి మధ్య సన్నిహిత సంబంధం ఉందని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి ఎన్నికల చిహ్నం 'కమలం ప్రతి చోట విజయానికి దోహదం చేసేలా కృషి చేయాలి' అని పార్టీ మద్దతుదారులకు మోడీ పిలుపు ఇచ్చారు. సందేశ్‌ఖలిలో సంఘటనలను మోడీ ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత మహిళలను వారి మానాన వారిని వదలివేసి నిందితులకు దన్నుగా నిలచిందని ఆరోపించారు. సందేశ్‌ఖలిలో టిఎంసి నేతలు లైంగిక అత్యాచారాలకు పాల్పడ్డారని మహిలలు ఆరోపించిన విషయం విదితమే. 'రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు ప్రజలు నిరాశ చెందారు. ఎన్నో ఆశలతో టిఎంసికి అనుకూలంగా వారు పదే పదే తీర్పు ఇస్తూ వచ్చారు. కాని ఆ పార్టీ దౌర్జన్యానికి, ఆనువంశిక రాజకీయాలకు, నయవంచనకు మారు పేరుగా తయారైంది. టిఎంసికి అవినీతి, ఆశ్రిత పక్షపాతం తప్ప రాష్ట్ర అభివృద్ధి ప్రధానం కాదు' అని ప్రధాని విమర్శించారు. టిఎంసిపై మోడీ ఇంకా విరుచుకుపడుతూ 'తూ, మైః, కరప్షన్ హీ కరప్షన్' (మీరు, నేను, అవినీతి)' అనే పదాలకు ఇప్పుడు మారుపేరుగా మార్చుకుందని అన్నారు. కేంద్ర పథకాలను టిఎంసి దుర్వినియోగం చేస్తున్నదని, వాటిని తమ సొంత పథకాలుగా చెప్పుకుంటున్నదని, 'అవినీతి, ఆశ్రిత పక్షపాతం' సంస్కృతిని పెంచి పోషిస్తోందని మోడీ విమర్శించారు.

## రాజకీయ బాధ్యతలనుంచి నన్ను తప్పించండి: గౌతమ్ గంభీర్ విన్నపం



**న్యూఢిల్లీ మార్చి, 2 :** మనసులో ఏదీ దాచుకోకుండా మొహంమీద చెప్పేయడం మాజీ క్రికెటర్, ఎంపీ గౌతమ్ గంభీర్ కు అలవాటు. ఆయనలో దేశభక్తి ఉట్టిపడుతూ ఉంటుంది. ముఖ్యంగా పాకిస్తాన్ క్రికెటర్ల మీద ఒంటికాలిమీద లేస్తూ ఉంటాడు. క్రికెట్ నుంచి రిటైరయ్యాక, రాజకీయాల్లోకి ప్రవేశించి బిజెపి టికెట్ పై ఎంపీగా గెలిచి పార్లమెంటులోకీ అడుగుపెట్టాడు. అయితే ఐపీఎల్ లో కీలకపాత్ర వహిస్తూ, క్రికెట్ లోనూ తన వంతు పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా గౌతమ్ గంభీర్ చేసిన ట్వీట్ ఒకటి వైరల్ అవుతోంది. తనను రాజకీయ బాధ్యతలనుంచి తప్పించాలంటూ బీజేపి అధ్యక్షుడు నడ్డాను కోరినట్లు గంభీర్ తెలిపాడు. క్రికెట్ లో ముందుగా ఒప్పుకున్న బాధ్యతలను సజావుగా నిర్వర్తించేందుకు వీలుగా తనను రాజకీయ బాధ్యతలనుంచి తప్పించాలని ఆయన కోరాడు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని తనకు కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, హోమ్ మంత్రి అమిత్ షాకు గంభీర్ కృతజ్ఞతలు తెలిపాడు.

## బ్యాగులో బాంబు తీసుకెళ్లి, కేఫ్‌లో పెట్టిన

# ఆగంతకుడు!



బెంగుళూరులోని రామేశ్వరం కేఫ్ లో బాంబు పెట్టిన వ్యక్తిని పోలీసులు గుర్తించే పనిలో పడ్డారు. ఇందులోభాగంగా సీసి టీవి ఫుటేజీలు పరిశీలించగా, ఒక యువకుడు బ్యాగ్ తో సహా లోపలకి వెళ్లి, తిరిగి ఖాళీ చేతులతో బయటకు వెళ్లడం కనిపించింది. హొటల్లో టిఫిన్ తిని, బ్యాగ్ ను హ్యాండ్ వాష్ ప్రాంతంలో వదిలేసి వెళ్లిపోయాడు. అందులో టిఫిన్ బాక్స్ పెట్టుకునే చిన్న బ్యాగ్ ఒకటి ఉంది. ఈ టిఫిన్ బాక్సులోనే బాంబు పెట్టి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అదే యువకుడిని పేలుడుకి కొన్ని గంటల ముందు బెంగళూరులోని వైట్ ఫీల్డ్ ప్రాంతంలో గుర్తించారు.

తలపై టోపీ పెట్టుకుని, కళ్లద్దాలు ధరించి, మాస్క్ పెట్టుకోవడంతో అతని మొహం స్పష్టంగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు. రామేశ్వరం కేఫ్ లో బాంబు పేలిన దుర్ఘటనలో తొమ్మిదిమంది గాయపడ్డారు. కాలిన గాయాలైన ఒక మహిళకు డాక్టర్లు ప్లాస్టిక్ సర్జరీ చేశారు. గాయపడినవారిని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పరామర్శించారు.

## సంపాదకీయం

# భారత్ కొత్త సరిహద్దు...

భారతదేశం నుంచి రోదసిలోకి వెడుతున్న గగన్‌యాన్ వ్యోమగాములను దేశానికి పరిచయం చేశారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. ప్రతి దేశానికి అభివృద్ధి విషయంలో సమయం ఆసన్నమవుతుందనీ, ఇప్పుడు వచ్చిందనీ అంటూ గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ వాలిన ఘట్టాన్ని గుర్తుచేశారు. అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందని ఆయన నమ్ముతారు కనుక, అంతరిక్ష రంగంలో పదేళ్ళకు ముందు జరిగిన ప్రయోగాలను, ఇస్రో సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించకపోవడం సహజం. నలభైయేళ్ళ తరువాత భారతీయులు అంతరిక్షంలోకి వెడుతున్నారు అని ఆయన మాటమాత్రంగా అన్నందుకు, నాలుగుదశాబ్దాల క్రితం రాకేశ్‌శర్మ అంతరిక్షయానాన్ని, ఆ సందర్భంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశ్నకు సమాధానంగా 'సారే జహాసే అచ్ఛా' అంటూ వచ్చిన జవాబును ఇప్పుడు చాలామంది గుర్తుచేసుకుంటున్నారు. ఎనిమిదిరోజుల పాటు అంతరిక్షంలో గడిపిన ఆ ఎయిర్‌ఫోర్స్ మాజీ పైలట్ శిక్షణపొందిన యూరీగగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లోనే ఇప్పటి గగనయాన వీరులూ శిక్షణ తీసుకున్నారు. భారత్–సోవియట్‌లు సంయుక్తంగా చేపట్టిన ఆ మిషన్ దేశ అంతరిక్ష పరిశోధనలకు ఊతం ఇచ్చినట్టుగానే, భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ల ఈ గగనయానంతో దేశప్రతిష్ఠ ఇనుమడిస్తుంది, ప్రపంచంలో నాలుగోస్థానంలో నిలుస్తుంది. నలభైయేళ్ళలో దేశప్రధాని ఇస్రోను సందర్శించడం ఇదే తొలిసారని ఆ సంస్థ చైర్మన్ సంతోషిస్తున్నారు. ప్రధానుల రాకలూ, ప్రత్యక్ష వీక్షణాలు, ప్రసంగాలు, పరామర్శలతో నిమిత్తం లేకుండానే ఇస్రో దశాబ్దాలుగా స్వయంకృషితో చక్కగా ఎదిగివచ్చిందని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఇక, ఈ నలుగురు వీరులను యాత్రకు సిద్ధం చేయడంద్వారా గగన్‌యాన్ విషయంలో దేశం మరో కీలకమైన ముందడుగువేసింది. గత ఏడాది అక్టోబర్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థను ఇస్రో విజయవంతంగా పరీక్షించిన విషయం తెలిసిందే. అనుకోని అవాంతరాలు ఏర్పడిన వక్షంలో వ్యోమగాములను కాపాడుకొనేందుకు ఉద్దేశించిన వ్యవస్థ ఇది. వచ్చే ఏడాది యాత్రకు అన్ని ఏర్పాట్లూ వేగం పుంజుకుంటున్న తరుణంలో 2009లో ఓ పన్నెండున్నర వేలకోట్లతో అనుకున్నది ఇప్పటికి సాధ్యపడబోతున్నదని అర్థం. 2019 సార్వత్రక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2018లో మోదీ ప్రభుత్వం దీనికి తొమ్మిదివేలకోట్ల కేటాయింపుతో తిరిగి పట్టాలెక్కించింది. ఆ ఏడాది స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో 2022లోనే గగన్‌యాన్ అని మోదీ ప్రకటించారు. కరోనా సహా చాలా కారణాలతో అది సాధ్యపడలేదు. ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్ష కక్ష్యలోకి పంపి, మూడురోజులు ఉంచి వెనక్కు క్షేమంగా తీసుకొచ్చే ఈ ప్రాజెక్టు నిజానికి అంగారక యాత్రకంటే, చంద్రయానం కంటే ఖరీదైనదీ, క్లిష్టతరమైనది కూడా. గగనయానానికి ఎంపికైనవారిని దేశానికి ఇలా పరిచయం చేయడానికి కొద్దిరోజుల ముందే అంతరిక్షరంగంలో నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ కేంద్రమంత్రివర్గం ఓ నిర్ణయం తీసుకుంది. 'ఇండియన్ స్పేస్ పాలసీ%--%2023' ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా ఈ నిర్ణయం జరిగింది. అంతరిక్ష ఆర్థికంలో ప్రైవేటుభాగస్వామ్యం అత్యంత కీలకమైనదని, అంతరిక్షంలో వాణిజ్యపరమైన ఉనికిని పెంచుకోవడం దేశానికి ముఖ్యమని ఆ పాలసీ అంటున్నది కనుక, ఏ ఆటంకాలూ, ఆంక్షలూ లేని విదేశీపెట్టుబడుల ప్రవాహానికి దారులు తెరుచుకున్నాయి. ప్రైవేటురంగం భాగస్వామ్యాన్ని పెంచి, ఉపగ్రహాల నుంచి అంతరిక్ష నౌకల తయారీవరకూ సకలకార్యకలాపాలను ఉధృతం చేసేందుకు ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు దోహదం చేస్తుంది. అంతరిక్షమార్కెట్‌లో మన వాటా పెంచుకోవడానికి ఇతోధికంగా దోహదపడుతుంది. పెట్టుబడులతో పాటు పరిజ్ఞానం ఎంతమేరకు ప్రవహిస్తుందో తెలియదు కానీ, అత్యంత కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగంలోకి చిన్నాపెద్దా గ్లోబల్ సంస్థలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానూ ప్రవేశించనీయడం సమంజసమేనా అన్నది ప్రధానం. భారత అంతరిక్ష అన్వేషణలూ, అధ్యయనాలు పెద్దదేశాలతో పోటీపడుతూ, పైచేయి సాధించడానికి ఉద్దేశించినవి కాదని, నేలమీద నిలబడి, సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించినవని 1960లో విక్రమ్ సారాభాయ్ అన్నారట. దశాబ్దాలపాటు అదే దిశలో ప్రయాణం సాగింది కూడా. ఇప్పుడు శాస్త్రీయపరంగా కొత్త అన్వేషణలు, సామాజిక ప్రయోజనాలకంటే స్పేస్ సూపర్‌పవర్ అనిపించుకోవాలన్నదే ప్రధానంగా పాలసీలు తయారవుతున్నాయి. తదనుగుణంగా సొంత అంతరిక్ష కేంద్రం నిర్మాణం, చంద్రుడిమీద కాలూనడం వంటివి ప్రధానమవుతున్నాయి. ప్రపంచం మనవైపు చూడాలన్న కోరికా పెరుగుతోంది.

# మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి పురస్కరించుకొని రక్తదానం చేసిన మండల కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 87వ జయంతి పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. శనివారం గాంధీ భవన్ లో దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి కార్యక్రమం సందర్భంగా రక్త దానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వజ్జల శేశాంత్, తూంకుంట మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ గౌడ్ జయంతి వేడుకలకు తరలి వెళ్లారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించి అనంతరం అక్కడ జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

# మాజీ అసెంబ్లీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి పురస్కరించుకొని నివాళులు



**శామీర్ పేట (గరుడ వార్త):** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ అసెంబ్లీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని శనివారం రోజున జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి వారి చిత్రపటానికి పూలమాల వేసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ వారు నిర్వహించిన సైక్లింగ్ పోటీలలో విజేతలైనవారికి అదనపు కలెక్టర్, డిఆర్ఓ హరిప్రియ బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ దిలీప్ కుమార్, పిడి డిఆర్ డిఎ సాంబశివరావు,యూత్ వెల్ఫేర్ అధికారి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మరో వరం గృహజ్యోతి పథకం: జిల్లా కాంగ్రెస్ నాయకులు తుంకి మల్లేష్



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం అనుగుణంగా గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుంకి మల్లేష్ అన్నారు. శనివారం శామీర్ పేట మండలంలోని మజీద్ పూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా అర్హులైన లబ్దిదారులకు జీరో బిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో రెండు పథకాలను ప్రారంభించిందని తెలిపారు. ఇందులోని ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం అర్హులైన పేదలందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతారని తెలిపారు.

అర్హులైన ప్రజలందరూ ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకాన్ని సద్వినియం చేసుకొని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తుంకి బిక్షపతి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అబ్బగౌని బిక్షపతి గౌడ్, మాజీ సర్పంచ్ ఏళ్ల మల్లేష్ ముదిరాజ్, గ్రామ అధ్యక్షుడు అబ్బగౌని ఎట్టయ్య గౌడ్, గిర్మాపూర్ నర్సింగరావు గౌడ్, విద్యుత్ లైన్మెన్ రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ లో పూర్తిచేసేలా చర్యలు: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** నిర్ణీత గడువు లోపు ధరణి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ నెల 9 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేటులోని విసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ పై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతు ధరణి పోర్టల్ పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలి అనే విషయం పై ఆర్డీఓలకు, తహసీల్దార్లకు, ధరణి ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ధరణి పోర్టల్ లో ఉన్న మాడ్యూల్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఒక్క మాడ్యూల్ గురించి వివరంగా తెలియపరచడం జరిగింది. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్లైన్ లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయి లో కలెక్టరేట్ కు సమర్పించాలని అన్నారు. చాల జాగరూకతతో పాటు వేగవంతంగా ఈ స్పెషల్ డ్రైవ్ ను పూర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సనాతన ధర్మం గొప్పది

## : మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి



హైదరాబాద్: భారతీయ సనాతన ధర్మం చాలా గొప్పదని భారతీయ జనతా పార్టీ నాయకులు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ళలోని వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ 'కళాకృతి' పేరుతో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసత్యం నుంచి సత్యానికి, చీకటి నుంచి వెలుగులోనికి, మృత్యువు నుంచి అమరత్వానికి విడిచి పెట్టమన్న ఈ మాటలు సనాతన ధర్మంలోనివన్నారు. ఈ ఆలోచనలు నాలుగైదు వేల సంవత్సరాల క్రితం నుంచి ఉన్నాయన్నారు. వీటికి కుల, మతాలకు సంబంధం లేదన్నారు. ఇంత గొప్ప ఆలోచనలు కేవలం భారతదేశానికి మాత్రమే కలవన్నారు. అణుశక్తిని కనిపెట్టింది యూరప్ కాదని, వేలాది సంవత్సరాల క్రితం భారత్ కనిపెట్టిందన్నారు. ఎన్నో కారణాలతో భారతదేశ గొప్పతనం, సైన్స్ మర్చిపోయామన్నారు. ఆ క్రమంలో స్వాతంత్ర్యం కూడా కోల్పోయాయని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ముందుకు సాగుతున్నామన్నారు. గత పదేళ్లలో భారతదేశం ఏవిధంగా ఉండేదో గుర్తించారని, భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆశిస్తున్నారన్నారు. నేషన్స్ ఫస్ట్ దృక్పథంతో ముందుకు సాగుతుండటంతో పదేళ్లలో పది నుంచి ఐదో స్థానానికి వచ్చామన్నారు. ఇంకో రెండేళ్లు ఉంటే మూడో స్థానానికి వచ్చేస్తామన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు అవుతుందని, ఆ సమయానికి ప్రపంచంలోనే భారతదేశం నెంబర్ వన్‌గా ఉండాలన్న ధ్యేయంతో ప్రధానమంత్రి మోడీ అడుగులు వేస్తున్నారన్నారు. మన పిల్లలే మన భవిష్యత్తు దేశం ముందుకు వెళ్లాలంటే, పిల్లల ఆరోగ్యం ముఖ్యమన్నారు. దీంతో పాటు మంచి విద్య అవసరమని, ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రపంచంలో అతిపెద్ద కంపెనీల సీఈవోలు, ఎండీలు భారత్‌కు చెందిన వారేనని, గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలే ఇందుకు ఉదాహరణ అన్నారు. గతంలో నాలెడ్జ్‌కు ప్రాధాన్యత ఉండేదని, ఇప్పుడు కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యత పెరిగిందన్నారు. అందుకే ఏం మాట్లాడినా కాన్ఫిడెన్స్‌తో మాట్లాడాలని సూచించారు. సీబీఎస్ఈ సిలబస్ ఉన్న ఈ స్కూల్ చేవెళ్ళలో ఉండటం సంతోషంగా ఉందని, భాష, సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకూడదన్నారు. మా తండ్రి ఎంత ఎత్తుకు ఎదిగినా గ్రామాన్ని మర్చిపోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కె. నరేష్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, కరస్పాండెంట్ లావణ్య నరేష్, డైరెక్టర్ హనుమంతరావు, మౌనికా వెంకటరెడ్డి, హరికృష్ణ, ప్రిన్సిపాల్ మానస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే, జైరాం తప్పుడు సోషల్ వేషాలు..

## కేంద్ర మంత్రి గడ్కరీ లీగల్ నోటీసులు



నాగ్‌పూర్ : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి జై రాం రమేష్‌లకు లీగల్ నోటీసులు పంపించారు. తనపై తప్పుడు , అప్రదిష్ట పాలుచేసే వార్తలు ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ తమ లాయరు బాలేందు శేఖర్ ద్వారా ఈ నోటీసులు వెలువరించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా కాంగ్రెస్ నేతలు తమ క్లయింట్ ప్రతిష్టకు మచ్చ తెస్తున్నారని పేర్కొంటూ , వారి సామాజిక మాధ్యమ స్పందనలను వెంటనే తొలిగించుకోవల్సి ఉంటుంది. లిఖితపూర్వక క్షమాపణలకు దిగాల్సి ఉంటుంది. లీగల్ నోటీసు అందిన 24 గంటల వ్యవధిలో వీరి నుంచి తగు స్పందన లేకపోతే తాము తీసుకోబోయే తదుపరి చర్యలకు ఎదురుచూడాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్రంలో జాతీయ రహదారులు, పోర్టుల కీలక మంత్రి అయిన నితిన్ గడ్కరీ లాలన్‌టాప్ అనే వెబ్‌పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేశంలో మోడీ హయాంలో రోడ్లు బాగాలేవని, మంచినీరు లేదని, ఆసుపత్రులు, విద్యాసౌకర్యాలు లేవని కేంద్ర మంత్రి గడ్కరి చెప్పినట్లు ఈ ఇరువురు నేతలు ఆయన ఇంటర్వ్యూలోని అంశాలను వక్రీకరించారని, ఇదంతా కూడా లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ నాయకత్వంలోని బిజెపిని అప్రతిష్టపాలుచేసేందుకు చేపట్టిన చర్య అని, ఇందులో వీరు తమ క్లయింట్‌ను కించపరిచే విధంగా వ్యవహరించారని పేర్కొంటూ ఈ లీగల్ నోటీసులు వెలువడ్డాయి.

# పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి బిజెపి శంఖారావం

హైదరాబాద్: రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ప్రధాని నరేంద్ర మోడీ శంఖం పూరించనున్నారు. ఈనెల 4, 5 తేదీల్లో తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఈ పర్యటనలో ఆదిలాబాద్, పటాన్ చెరు వేదికగా రూ. 15,718 కోట్ల విలువ గల పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వంటి అధికారిక కార్యక్రమాలతో పాటు పార్టీ బహిరంగ సభల్లోనూ పాల్గొననున్నట్లు వెల్లడించారు. మార్చి 4వ తేదీన ఉ.9 గం.లకు ఆదిలాబాద్ స్టేడియంలో జరిగే విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు వికసిత్ భారత్ లక్ష్యాల గురించి ప్రజలకు వివరిస్తారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న విజయ సంకల్ప బహిరంగ సభల్లో రాష్ట్ర నాయకులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు పాల్గొననున్నారు. అదేవిధంగా మార్చి 5 వ తేదీన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పటేల్ గూడలోని ఎల్లంకి ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా జరిగే విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలు చేసి జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారు.



లోక్ సభ ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో తెలంగాణ ప్రజలకు ప్రధాని మోడీ కీలక సందేశాన్ని ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి, బహిరంగ సభలను విజయవంతం చేయాలని, బిజెపికి అపూర్వ మద్దతు తెలిపాలని విజ్ఞప్తి చేశారు.

# గంటకు 250 కిమీ వేగంతో నడిచే రైళ్ల నిర్మాణానికి కృషి: రైల్వే మంత్రి



న్యూఢిల్లీ: దేశంలో రానున్న సంవత్సరాలలో కనీసం వెయ్యి నవ తరం వందే భారత్ రైళ్లను తయారు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గంటకు 250 కిలో మీటర్ల వేగంతో నడిచే రైళ్ల నిర్మాణానికి కృషి జరుగుతోందని మంత్రి వెల్లడించారు. మంత్రి పిటిఐ వీడియోస్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, వందే భారత్ రైళ్ల ఎగుమతికి ప్రయత్నాలను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించిందని తెలియజేశారు. తొలి రైలు ఎగుమతి వచ్చే ఐదు సంవత్సరాలలో జరగగలదని ఆయన సూచించారు.

గడచిన పది సంవత్సరాల నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో రైల్వే శాఖ తీసుకున్న పరివర్తన చర్యల గురించి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, రైల్వే రంగంలో చోటు చేసుకున్న గణనీయమైన సాంకేతిక మార్పులలో కొన్ని ప్రపంచంలో అత్యంత ఎత్తైన రైల్వే వంతెన (చీనాబ్ వంతెన), తొలి నదీ గర్భ నీటి సొరంగ మార్గం (కోల్‌కతా మెట్రో కోసం) అని తెలియజేశారు. ప్రస్తు బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా ముంబయి, ఠాణె మధ్య భారత్ తొలి సాగర గర్భ సొరంగ మార్గం నిర్మాణం ప్రారంభం గురించి కూడా మంత్రి మాట్లాడారు. అటువంటి టెక్నాలజీలు ఉన్న దేశాలు ప్రపంచంలో ఐదు మాత్రమే ఉన్నాయని ఆయన తెలిపారు.

ముంబయి, ఠాణె మధ్య 21 కిలో మీటర్ల నిడివి ప్రతిపాదిత సొరంగ మార్గం సముద్రంలో 9.7 కిలో మీటర్ల దూరం, సాగర గర్భం కింద 54 మీటర్ల దూరం మేర సాగుతుందని ఆయన వివరించారు. రైల్వేల చార్జీల వ్యవస్థ, సాధారణ ప్రజాలకు రైల్వే సేవల గురించి కూడా వైష్ణవ్ మాట్లాడారు. 'మేము ఏటా దాదాపు 700కోట్ల మందిని, రోజూ 2.5 కోట్ల మందిని తీసుకువెళుతున్నాం. చార్జీల పద్ధతి ఎలా ఉంటుందంటే ఒక వ్యక్తిని తీసుకువెళ్లడానికి రూ. 100 చార్జీ ఉంటే మేము రూ. 45 వసూలు చేస్తుంటాం. అంటే సగటున రైల్వేల్లో ప్రయాణించే ప్రతి వ్యక్తికి 55 శాతం రాయితీ ఇస్తున్నామన్న మాట' అని మంత్రి తెలిపారు.

రైల్వేల వార్షిక వ్యయం గురించి కూడా మంత్రి వైష్ణవ్ వివరించారు. పింఛన్లు, జీతాలు, ఇంధన బిల్లు, లీజ్ వడ్డీ చెల్లింపులు వరుసగా రూ. 55 వేల కోట్లు, రూ. 97 వేల కోట్లు, రూ. 40 వేల కోట్లు, రూ. 32 వేల కోట్లు అని ఆయన చెప్పారు. నిర్వహణపై మరి రూ. 12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, మొత్తం వ్యయం దాదాపు రూ. 2.40 లక్షల కోట్లు అవుతుందని మంత్రి తెలియజేశారు. 'మేము ఈ ఖర్చులు అన్నిటినీ ప్రధాని మార్గదర్శకత్వంలో బృందం తీవ్ర కృషి చేస్తుండడమే ఇందుకు కారణం' అని వైష్ణవ్ తెలిపారు. 'పది సంవత్సరాల క్రితం నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు రైల్వే స్టేషన్లు ఎంతో భిన్నమైనవి. ప్రతి రైలులో బయో టాయిలెట్ ఉంటున్నది' అని మంత్రి చెప్పారు. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడంతో వందే భారత్ వంటి రైళ్లు యువత అమిత ఆదరణను చూరగొంటున్నాయని ఆయన తెలిపారు.

'ప్రతి వారం ఒక వందే భారత్ రైలు సర్వీసు ప్రారంభం అవుతోంది. రానున్న కొన్ని ఏళ్లలో కనీసం 400 నుంచి 500 వందే భారత్ రైళ్లను తయారు చేయనున్నాం' అని వైష్ణవ్ తెలియజేశారు. రైలు మార్గాల విస్తరణ గురించి మంత్రి ప్రస్తావిస్తూ, 'నిరుడు 5200 కిలో మీటర్ల కొత్త మార్గం వేశాం. ఈ ఏడాది 5500 కిలో మీటర్ల కొత్త మార్గం వేస్తాం. ఇది ఏటా దేశానికి స్విట్జర్లాండ్‌ను చేర్చడం వంటిది. అంతటి వేగంతో పని సాగుతోంది' అని మంత్రి చెప్పారు. ప్రయాణికుల భద్రత చర్యలను వైష్ణవ్ వివరిస్తూ, గడచిన పది సంవత్సరాలలో ప్రయాణికుల భద్రతపై రూ.1.27 లక్షల కోట్లకు పైగా వెచ్చించినట్లు, ఏటా 7000 కిలో మీటర్ల పాత రైలు మార్గాలను మారుస్తున్నట్లు తెలియజేశారు.


# మహాత్మాఫూలే దార్శనికత దేశానికి ఆదర్శం : లింబాద్రి



హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాఫూలే ఆలోచన, తాత్వికత సమకాలీన సమాజానికి మార్గనిర్దేశనం చేస్తాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో గత రెండు రోజులుగా మహాత్మా జ్యోతిబాఫూలేపై జరుగుతున్న జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పూర్వం సమాజంలో అంటరానితనం, అవిద్య వంటి ఎన్నో అసాంఘిక దురాచారాలను ఎదుర్కొని మహిళా విద్య, అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాఫూలే అని అన్నారు. ఫూలేని అధ్యయనం చేయకుండా భారతదేశ చరిత్ర అర్థం కాదని, ఫూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ అందించిన భావజాలం ఈ దేశ గతిని మార్చిందన్నారు. సమాజాన్ని మార్చాలనుకునే ప్రతీవ్యక్తి ఫూలే, అంబేద్కర్ తాత్వికతను అధ్యయనం చేయాలన్నారు. అనంతరం ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్ ప్రసంగిస్తూ బడుగు, బలహీన వర్గాల వారి కోసం ఫూలే చేసిన కృషి ప్రశంసనీయమని, ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని పేర్కొన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థ నుంచి ఆవిర్భవించిన కులవ్యవస్థ భారత దేశంలో అత్యంత ధృడంగా వేళ్లూనుకుని ఉందన్నారు. అయితే కులవ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించివేయడానికి ఫూలే భావజాలం దారిచూపిస్తుందన్నారు.

# దృశ్యాల వెనుక అదృశ్య ప్రయోజనాలు.....!

అందరూ వేషాలు వేస్తారు, మాటలూ చెబుతారు. కానీ, అందరి పప్పులూ ఉడకవు. ఏమి చూపించినా, ఏమి చెప్పినా, జనానికి ఏమి కనిపించిందన్నదే ముఖ్యం. దర్పా ప్రదర్శించబోతాం, జనం మాత్రం దర్పాన్ని చూస్తారు. మంచితనం చూపబోతాం, మెతకదనమే కనిపించవచ్చు. అప్పుడిక మార్గం ఏమిటంటే, ఎట్లా కనబడితే అనుకున్న ప్రయోజనం దొరుకుతుందో, అట్లా కనిపించగలగాలి. అదొక విద్య. దానికో శాస్త్రం ఉంది. కొందరు నిపుణులున్నారు. ఈ ఇంద్రజాలికులు, జనం దృక్కులయంతో యథేచ్ఛగా విన్యాసాలు చేయగలరు. అబ్బురపరిచి, తన్మయపరిచి, వశీకరణం చేసుకోగలరు. వారు కనికట్టు చేసినప్పుడు, ఒక దృశ్యాన్ని చూసినప్పుడు పారవశ్యం కలుగుతుంది. మనకు కలిగే మనోభావాలు ఎవరో సంకల్పించి జొప్పించినవి అని కనిపెట్టలేము. నాడీమండలం పూర్తిగా పరాధీనం అయిపోతుంది. ఏది హితవో ఏది కాదో విచక్షణ ఉండదు. నరేంద్రమోదీ ద్వారక దగ్గర చేసిన పని ఏదో, ఆయన కేవలం తన సొంత భక్తిలో భాగంగా చేసి ఉంటారని, లేదా, యథాలాపంగా జరిగి ఉంటుందని అనుకోలేము. ఆ ప్రక్రియ అంతటినీ దృశ్యీకరించి ప్రపంచంతో పంచుకున్నారు కాబట్టి, దానికి ఒక సార్వజనీన విలువ ఉంటుంది, ఒక ప్రయోజనమూ ఉంటుంది. ఆయనను అట్లా చూసిన ప్రజలు రకరకాల భావసంచలనాలను పొంది ఉంటారు. అట్లా పొందడం కోసమే ఆ సన్నివేశం ఏర్పడి ఉంటుంది. మోదీ వంటి నాయకుడి ప్రతిక్షణమూ, ప్రతిచర్యా అతి జాగ్రత్తగా ముందస్తు రూపకల్పనతో, నిర్దిష్ట లక్ష్యంతో నిర్మితమవుతుంది. అందుకోసం పెద్ద పటాలమే పనిచేస్తూ ఉంటుంది. ఎన్నో రాచకార్యాలతో ఎంతో పనిఒత్తిడిలో ఉండే పదవిలో ఉన్నారు మోదీ. పైగా, ఎన్నికలు సమీపిస్తున్నందున, రాజకీయమైన పనిభారం కూడా ఆయన మీద చాలా ఉన్నది. వీటన్నిటి మధ్య ఆయన ద్వారక సందర్శన చేశారంటే, స్వామి కార్యంతో పాటు స్వకార్యం కూడా ఉండి ఉండాలి. ఈ మధ్య నరేంద్రమోదీ ఎక్కడికి ఏ అధికారిక, రాజకీయ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడికి సమీపంలోని గుడులు గోపురాలను సందర్శిస్తున్నారు. రామ మందిర ప్రతిష్ఠకు ముందు అయితే, దేశవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో ఆయన ఆలయసేవ చేశారు, నిద్రచేశారు. వీటన్నిటిని గమనిస్తున్నవారు, ఆయన దేశానికి ప్రధానమంత్రా, ప్రధాన అర్చకుడా అని హాస్యాలు కూడా చేశారు. రెంటికి మధ్య సరిహద్దులు చెరిగిపోయే కాలంలో జీవిస్తున్నామని ఆ వేళాకోళాల వారికి తెలియనట్టుంది. మోదీ తమ పార్టీ బలాన్ని 370కి, కూటమి బలాన్ని 400కు పెంచే మహాకార్యంలో ఉన్నారు. ద్వారక సందర్శనతో సహా అన్ని ఆలయ పర్యటనలూ ఆ మహాకార్యంలో భాగాలే. ఒక వయసు వచ్చిన తరువాత రామా, కృష్ణా అనుకోవాలని పెద్దవాళ్లు చెబుతుంటారు. పార్టీ సహచరులలో ముప్పాతిక వయసు వచ్చినవారందరినీ వానప్రస్థానికి పంపించివేసిన నరేంద్రమోదీ, తాను మాత్రం ముచ్చటగా మూడోసారి పదవికి సిద్ధపడుతున్నారు. పదవిలో ఉంటూ కూడా రామా, కృష్ణా అనుకోవడంలో ఆయనకు పుణ్యం, పురుషార్థం రెండూ ఉన్నాయి. అయోధ్య కార్యక్రమంతో రామస్మరణ జరిగింది, ద్వారక విన్యాసంతో కృష్ణ కృష్ణ అని కూడా అనుకున్నారు. మరోపక్క వారణాసిలో హరహరమహాదేవుడు కూడా సిద్ధమవుతున్నాడు. ద్వారక శిథిలాలు ఉన్న సముద్రభాగంలో నీటిలోపల మోదీ కూర్చుని, నెమలీకలు సమర్పించి భక్తి ప్రదర్శించిన దృశ్యాన్ని చూసి, చాలా మంది ప్రజలు పులకించిపోయి ఉంటారు. రామాలయాన్ని మోదీయే సాధించారని ఒక వాడుక స్థిరపడిన వాతావరణంలో, ఇప్పుడు మరో అవతార పురుషుడి రాజ్యస్థానంలో, ఎంతో ప్రమాదానికి సిద్ధపడి భక్తి ప్రదర్శించడం ఆయనను జనహృదయాలలో మరొక మెట్టు ఎక్కించింది. మ్లేచ్ఛ నామం కలిగిన అరేబియా సముద్రం నుంచి ద్వారకను పైకి తీసుకురాగలిగిన ధీరుడు అని కూడా మోదీ మీద అంచనాలు పెరిగి ఉండవచ్చు. మోదీ అనే ఒక సజీవ విగ్రహాన్ని తాము సంకల్పించిన రూపురేఖలతో నిర్మించడానికి, వాటిని మెచ్చేటట్టుగా ప్రజలను తీర్చిదిద్దడానికి గత దశాబ్దంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే ద్వారక రంగస్థలం రూపొందింది. అట్లాగని, నరేంద్రమోదీకి భక్తి లేదని కాదు. భక్తినివేదనను ఈ రూపంలో ప్రదర్శించి, ప్రచారం చేయడంలో ఉద్దేశం వ్యక్తిగతం కాదు. ఆయన వంటి రాజకీయనాయకుడు ప్రదర్శించే అన్ని వ్యక్తిత్వ లక్షణాలూ వాస్తవంలో ఉండనక్కరలేదు. హిమాలయాల్లో పర్వతగుహల్లో ధ్యానం చేయడం, సముద్రతీరంలో వాలుకుర్చీలో సేదతీరడం, సఫారీ వాహనం మీద వేటగాడి వేషంలో సంచరించడం, డిస్కవరీ ఇంటర్వ్యూ కోసం వనవిహారం చేయడం, సముద్రం ఒడ్డున స్వచ్ఛభారత్ చేయడం... బహుముఖ ప్రజ్ఞలు, సకల కళలు ఉన్న మహానాయకుడుగా మోదీ కనిపించి, ఆశ్చర్యపరుస్తారు. ధీరుడు, వీరుడు, కర్మశుడు, కారుణ్యమూర్తి, విహారి, వినోది, భక్తుడు, ఈ వ్యక్తిత్వాలను అన్నిటిని జనహృదయాలలో ప్రతిష్ఠించిన ప్రజాసంబంధాల ప్రచారవ్యవస్థను అభినందించవచ్చు. వేషభాషలు, ఇతర ప్రదర్శనలు రాజకీయరంగంలో ఎప్పటినుంచో ఉన్నాయి. గాంధీజీకి తన ఆహార్యమే పెద్ద రాజకీయ ఆయుధం. చైనా నేత మావోసేటుంగ్ 1960 దశకం మధ్యలో కమ్యూనిస్టు పార్టీలో బలహీనపడినప్పుడు, 73వ ఏట యాంగ్సీ నదిని మరోసారి ఈది, తన దృఢత్వాన్ని ప్రదర్శించాడు. ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఆరంభదినాల్లో ఖాకీ డ్రెస్‌లోనూ, తరువాత కాషాయంలోను ఎన్టీయార్ ఉద్దేశించిన ప్రయోజనాలు రాజకీయమైనవే. బేఖాతరు జులాయి అధ్యక్షుడిగా కనిపించడం వల్లనే డొనాల్డ్ ట్రంప్ 2020లో ఓడిపోయారు. జో బైడెన్ తనను తాను అమెరికాకు అవసరమైన అనుభవశాలినని అనుకుంటుంటే, ప్రజలు మాత్రం ఇప్పుడు తడబడునడకల నీరస వృద్ధుడిగా చూస్తున్నారు. భౌతిక శాస్త్రంలోనే కాదు, రాజకీయాలలోనూ 'ఆప్టిక్స్' దృశ్యనిర్వహణగా ఇప్పుడు మంచి డిమాండ్‌లో ఉన్నది. 'ఆప్టిక్స్'ను సమర్థంగా నిర్వహించాలని బీజేపీ అనుకోవడం సహజమే. అందుకు కావలసిన హంగు,



సమర్థతా కూడా ఆ పార్టీకి ఉన్నాయి. మరి వ్యూహకర్తలు సంకల్పించిన దృశ్యాలను జనం వడగట్టుకోరా? ఆ కనికట్టులోకి అందరూ జారిపోతారా? మోదీ ద్వారక సన్నివేశాన్ని ప్రశంసాపూర్వకంగా చూసేవారు, నిజంగా ఆయన ప్రయత్నంలో రాజకీయ ఉద్దేశ్యాలు లేవని అనుకుంటారా? లేక, భక్తిని రాజకీయాలకు వాడుకోవడం కాక, రాజకీయాలనే భక్తివ్యాప్తికి ఉపయోగించుకుంటున్నారని మెచ్చుకుంటారా? ఆలయ సందర్శనల మధ్య విరామంలో, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ లేదా గగన్‌యాన్ వ్యోమగాముల ప్రకటన కార్యక్రమంలోనో మోదీ కనిపిస్తారు. వైజ్ఞానిక, మౌలిక వసతుల అభివృద్ధివాదిగా ప్రదర్శిస్తున్న మరో ముఖాన్ని కూడా ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారా? దైనందిన జీవితానికి ఎంతో కీలకమయిన అవసరాలను నెరవేర్చడంలో విఫలమైన నాయకుడి ముఖాన్ని మరచిపోతారా? ఓటు మీట నొక్కేముందు ఏ ముఖం వారికి గుర్తుకు వస్తుంది? వాస్తవమైన, భౌతికమయిన కష్టనష్టాలు, స్థితిగతులు ప్రధానం కాకుండా, ఉద్వేగపూరిత ప్రపంచంలోకి పంపించడం ఈ ప్రక్రియల లక్ష్యం. చారిత్రక అన్యాయం, వర్తమానంలో దాని నివృత్తి, ఒక ప్రజాసమూహంపై కృత్రిమ ఆధిక్య ప్రదర్శన, ఇవన్నీ వాస్తవజీవితాన్ని మెరుగుపరిచేవి కావు.

# తెలంగాణలో బ్లడ్ బ్యాంకులకు డీసీఏ హెచ్చరిక




**హైదరాబాద్ :** తెలంగాణలో బ్లడ్ బ్యాంకులకు డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు. రక్తానికి సంబంధించి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులకు ప్రాసెసింగ్ చార్జీలను మించి వసూలు చేయరాదని డీసీఏ స్పష్టం చేశారు. ప్రతి బ్లడ్ బ్యాంక్ వద్ద చార్జీలను కనిపించేలా పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో బ్లడ్ బ్యాంకులకు డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు. రక్తానికి సంబంధించి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులకు ప్రాసెసింగ్ చార్జీలను మించి వసూలు చేయరాదని డీసీఏ స్పష్టం చేశారు. ప్రతి బ్లడ్ బ్యాంక్ వద్ద చార్జీలను కనిపించేలా పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తే 1800-599-6969 కు ఫోన్ చేయాలని ప్రజలకు డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ సూచనలు చేశారు. కాగా.. ఇటీవల పలు బ్లడ్ బ్యాంకులపై డీసీఏ అధికారులు మెరుపు దాడలకు దిగిన విషయం తెలిసిందే. రక్తాన్ని సక్రమంగా నిల్వ చేయకుండా, అధిక చార్జీలు వసూలు చేస్తూ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న దాదాపు 9 బ్లడ్ బ్యాంకులపై తనిఖీలు నిర్వహించారు. ఈ బ్లడ్ బ్యాంకులు రక్తాన్ని సేకరించే క్రమంలో అన్ని దశల్లోనూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు డీసీఏ అధికారులు గుర్తించారు. దీంతో 9 బ్లడ్ బ్యాంకులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. రక్తాన్ని సేకరించిన తర్వత పలు నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. రక్తాన్ని సేకరించాక హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, సీ, సిఫిలిస్, మలేరియా వంటి టెస్టులు చేయాల్సి ఉంటుంది. దాతల పేర్లు, వారి రక్త పరీక్షల వివరాలను కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలి. అయితే కొన్ని బ్లడ్ బ్యాంకుల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేదని డీసీఏ అధికారులు గుర్తించారు. అలాగే అధిక ఛార్జీలు కూడా వసూలు చేస్తున్నట్లు నిర్ధారించారు. పలు బ్లడ్ బ్యాంకుల్లో పరికరాలు సరిగ్గా పనిచేయకపోవడం, సరైన నిపుణులు లేకపోవడాన్ని డీసీఏ అధికారులు గుర్తించారు.

# మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత

## – 11 మున్సిపాలిటీల్లో 66,095 దరఖాస్తులు పెండింగ్

## – 50 శాతం నుంచి 60 శాతం వరకే చేయగలమంటున్న అధికారులు



**మంచిర్యాల :** కాంగ్రెస్ సర్కారు కాసుల వేటలో పడింది. పైసల్ లేవు, అప్పులయ్యాయని చెప్పుకుంటూ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు మంగళం పాడే పనిలో పడింది. కాగా.. ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చి జనాలకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ఉచితం చేస్తామని, ఎవ్వరూ ఎల్ఆర్ఎస్ కట్టొద్దని చెప్పి ఇప్పుడు మాట మార్చింది. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి రుసుం చెల్లించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని ప్లేట్ ఫిరాయించింది. దీంతో కాంగ్రెసొస్తే ఉచితంగా లే-అవుట్‌లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని జనా లు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ 31 వరకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండు నెలలపాటు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించగా.. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ఆగింది. తాజాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ నెల రోజుల గడువు మాత్రమే ఇవ్వడం, పైగా పైసలు కట్టాలనడంతో గడువు లోపు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ పనిని మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేస్తారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లే ఇన్‌చార్జులుగా పని చేస్తున్నారు. అనుమతి ఇవ్వాలంటే ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందు లో ఎల్1 అంటే టీపీబీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూ శాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంట లు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా? లేకపోతే అన్ని సరిగ్గానే ఉన్నాయా? అన్నది రిపోర్ట్ చేస్తారు. అలా పరిశీలించిన వాటిని రెండో దశలో ఎల్2లో టీపీవో, టీపీఎస్ సరిచూసుకుని ఒకే చేస్తే నే, మూడో దశ ఎల్3లో మున్సిపల్ కమిషనర్ వాటికి ఆ మోద ముద్ర వేస్తారు. కానీ.. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఈ పనులు చేసేందుకు సరిపడా సిబ్బంది లేరు. ఉదాహరణకు.. మంచిర్యాల ము న్సిపాలిటీనే తీసుకుంటే దాదాపు కొన్ని నెలలుగా ఇక్కడ టీ పీవో లేరు.


# అలంకారప్రాయం.. కార్యాలయానికి తాళం..

## జిల్లాలో కనరాని తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు.........



**కాగజ్‌నగర్ :** జిల్లాలో తూనికలు- కొలతల (లీగల్ మెట్రాలజీ) కార్యాలయం అలంకారప్రాయంగా మారింది. అధికారులతో పాటు సిబ్బంది సైతం అందుబాటులో ఉండటం లేదు. దీంతో తనిఖీలు మాట పక్కనపెడితే వినియోగదారులు ఫిర్యాదు చేద్దామని వచ్చినా కార్యాలయం తలుపులు నిత్యం మూసివేసి ఉండటంతో అసంతృప్తితో వెనుతిరుగుతున్నారు. వినియోగదారులకు నాణ్యమైన సరకులు అందుతున్నాయా? లేదా అని పర్యవేక్షించడం.. తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడం జిల్లా లీగల్ మెట్రాలజీ (తూనికలు-కొలతల) కార్యాలయం విధులు. ఎల్లప్పుడు ప్రజల్లో ఉండాల్సిన అధికారులు కనీసం కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో వ్యాపారుల మోసాలకు అడ్డూఅదుపు ఉండటం లేదు. తూనికలు కొలతల కార్యాలయం ఎప్పుడు తెరుస్తారో? ఎప్పుడు మూస్తారో ఎవరికీ తెలియదు. అటెండరు, వాచ్‌మెన్, కార్యాలయం ఉద్యోగితోపాటు, వరంగల్‌కు చెందిన తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇన్‌ఛార్జి అధికారి నెలలో రెండుసార్లు వచ్చి పోతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం వల్ల ఉద్యోగులు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీసం పని వేళల్లో సైతం కార్యాలయం తలుపులు తీయడం లేదు. జిల్లాలోని 15 మండలాలు, కాగజ్‌నగర్ పురపాలిక ఉంది. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌తోపాటు, సింగరేణి ఏరియాలోని రెబ్బెన, గోలేటి ఏరియాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. హోటళ్లు, కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ పంపులు, వాహన షోరూంలకు కొదువలేదు. తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు నాసిరకం పరికరాలు, తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), రెబ్బెన తదితర ప్రాంతాల్లోని బంకుల్లో పెట్రోలుకు బదులు నీళ్ల పోశారంటూ గతంలో పలువురు వినియోగదారులు ఆందోళన చేపట్టారు. కొన్నిచోట్ల పెట్రోల్ తక్కువగా పోస్తూ మోసగిస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి. అయినా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు.

# ఆశజనకంగా కంది సాగు..!



**కోదాడ :** కంది పంట కూడా మరో నెలలో చేతికి రానుంది. ఈ ఏడాది కంది పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉంది. ఇప్పటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కంది సాగుకు అనువుగా వర్షాలు ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. మిగతా పంటలతో పోల్చుకుంటే కంది సాగుకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. దీంతో రైతుకు ఈ పంట ద్వారా అధిక లాభం వచ్చే అవకాశం ఉంది. కంది వర్షాధార పంట కావడం, తెగుళ్లు ఎక్కువగా సోకకపోవడం, చేను ఎత్తుగా ఉండటంతో గడ్డి సమస్య ఉండకపోవడంతో రైతుకు అదనపు పెట్టుబడి బాధ తప్పుతుంది. పప్పు దినుసులకు మార్కెట్లో గిరాకీ ఉండటం, కందులకు గతంతో పోల్చుకుంటే క్వింటా ధర రూ.10 వేల వరకు పలుకుతోంది. ఎకరానికి సుమారు అయిదు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాదితో పోల్చుకుంటే ఈసారి కంది సాగు తగ్గింది. వరివైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతుండటంతో ఈ పంట సాగు తగ్గింది. ఈ ఏడాది మూడెకరాల్లో కంది సాగు చేశాను. కంది సాగుకు అనువుగా వర్షాలు ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. మిగతా పంటలతో పోల్చుకుంటే కంది సాగుకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. పప్పు దినుసులకు మార్కెట్లో గిరాకీ ఉండటం, కందులకు గతంతో పోల్చుకుంటే క్వింటా ధర రూ.10 వేల వరకు పలుకుతోంది. ఎకరానికి సుమారు అయిదు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాదితో పోల్చుకుంటే ఈసారి కంది సాగు తగ్గింది. వరివైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతుండటంతో ఈ పంట సాగు తగ్గింది.

# గృహ నిర్మాణ శాఖకు పునరుజ్జీవం.....



**మిర్యాలగూడ :** తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే సంకల్పంతో గృహనిర్మాణ శాఖను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో ఆ శాఖలో గతంలో పనిచేసిన ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బందిలో ఆశలు చిగురిస్తున్నాయి. 2014లో తెలంగాణలో తెరాస(భారాస) ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించి గృహనిర్మాణ శాఖను ఎత్తివేశారు. దీంతో ఆ శాఖలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులను ఇతర 12 ప్రభుత్వ శాఖల్లో ఇంజినీరింగ్ విభాగాల్లో సర్దుబాటు చేయగా, తాత్కాలిక సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. 2015లో తెలంగాణ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకం ప్రారంభించటంతో పూర్తిగా గృహనిర్మాణ శాఖ ఇతర శాఖల్లో విలీనం చేశారు. 2018 తరువాత గృహ నిర్మాణ శాఖలో ఇంజినీర్లను రహదారులు భవనాల శాఖలోకి మార్పిడి చేశారు. ఉమ్మడి జిల్లాలో 59 మండలాల్లో గృహనిర్మాణ శాఖ ఏఈ కార్యాలయాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకరు చొప్పున 12 మంది డీఈలు, 5 రెవెన్యూ డివిజన్‌లకు ఒకరు చొప్పున ఐదుగురు ఈఈలు, జిల్లా స్థాయిలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉండేవారు. వీరితో పాటుగా ప్రధాన పట్టణాల్లో పట్టణ ఏఈలు సైతం మిర్యాలగూడ, భువనగిరి, నల్గొండ, సూర్యాపేట దేవరకొండలో ఉండేవి. మండలానికి నలుగురు చొప్పున వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, కంప్యూటర్ సిబ్బంది విధులు నిర్వర్తించే వారు. వీరిలో తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన వారిని విధుల నుంచి తొలగించారు. తక్కువ వ్యయంతో రెండు పడకల ఇళ్ల నిర్మాణం జరిపిస్తామని గృహనిర్మాణ శాఖ అధికారులు మిర్యాలగూడ పట్టణంలోని 'ఇందిరమ్మ కాలనీ'లో సుమారు రూ.2.20 లక్షల వ్యయంతో రెండు పడకల ఇంటిని 'మోడల్ హౌజ్'గా నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది.

# ఇష్టారీతిన మట్టి తవ్వకాలు......!




సిరిసిల్ల:అడ్డగోలు తవ్వకాలు, అక్రమార్కుల బరితెగింపుతో కొండలు కరిగిపోతున్నాయి. ఖబ్రస్థాన్, డంపింగ్ యార్డు ఇలా దేనినీ వదలడం లేదు. ఇంత జరుగుతున్నా ఇదేమిటని అడిగే పరిస్థితే కనిపించడం లేదు. నిబంధనలు పక్కన పెట్టి, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఇదంతా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు. సిరిసిల్ల పట్టణ శివారు రగుడులో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని గుట్టలను తొలచివేస్తున్నారు. దీనికి సమీపంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన డంపింగ్‌యార్డు, వీధి కుక్కల సంరక్షణ కేంద్రం, ముస్లింల ఖబ్రస్థాన్ ఉంది. అయినా అక్రమార్కులకు అవేమీ పట్టడం లేదు. యంత్రాలతో గుట్టను గుల్ల చేస్తున్నారు. పగలు తవ్వకాలు జరుపుతుంటే స్థానికులు కొందరు అడ్డుకోవడంతో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వ సెలవు రోజులు, రాత్రిళ్లు తవ్వకాలు సాగిస్తున్నారు. పచ్చని కొండ ప్రాంతం నేడు రాళ్లతో గోతులమయమైంది. మట్టిని తరలించడానికి విధిగా రెవెన్యూ, గనులు, భూగర్భశాఖల అధికారుల అనుమతి అవసరం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ప్రభుత్వం మట్టి క్వారీలకు అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వం అనుమతి లేకపోయినా, బహిరంగంగా తరలిస్తున్నారు. ప్రభుత్వ నిర్మాణాలకు, స్థానిక అవసరాలకు అధికారుల అనుమతితో వేబిల్లులు చెల్లిస్తే పర్వాలేదు. ఇక్కడ తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు, స్థానిక అవసరాలకు లెక్కలు కట్టి విక్రయిస్తున్నారు.

# పులుపున్నా.. కాసుల పిలుపు లేకపాయె..!



**నడిగూడెం :** కిలో ధర రూ.15కు పడిపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు నిమ్మకాయలకు ధర పడిపోవడం, మరో వైపు కాయలు కోసేందుకు కూలీల కొరతతో నిమ్మ సాగు చేసిన రైతులు నిలువునా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో మామిడి తర్వాత నిమ్మ తోటలు అధికంగా సాగులో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా నడిగూడెం మండలంలోనే ఐదు వేల ఎకరాల పైచిలుకు నిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. ఆరుగాలం కష్టించి పంట చేతికొచ్చిన సమయంలో మార్కెట్‌లో ధర లేకపోవడంతో కొందరు రైతులు చెట్ల నుంచి కాయలు కోయక తోటలోనే నేల రాలిపోతున్నాయి. తోటలో నిమ్మకాయలు కోసి, మార్కెట్‌కు చేర్చేందుకయ్యే ఖర్చుల వరకు కూడా నిమ్మకాయలు విక్రయిస్తే రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ నెల మొదటి వారం వరకు కిలో రూ.30 పలికిన నిమ్మకాయల ధర గత వారం రోజుల నుంచి తగ్గుతూ వస్తున్నాయన్నారు. పది రోజుల వ్యవధిలోనే ధర సగానికి పడిపోవడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నడిగూడెం పరిసర ప్రాంతాల్లో మార్కెటింగ్ అవకాశం లేకపోవడంతో విజయవాడ, హైదరాబాద్, నకిరేకల్ ప్రాంతాలకు నిమ్మకాయలను తరలించడం వల్ల రవాణా ఛార్జీలు, కమీషన్ ఖర్చులు అదనంగా అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. చెట్లపై కాయలు గుత్తులుగా ఉన్నప్పటికీ కోసేందుకు కూలీలు అందుబాటులో లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడంతో రెండు విధాలా నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. తుపాను ప్రభావం కారణంగా నిమ్మ ధర సగానికి పడిపోయిందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దీనికి తోడు చలివాతావరణంతో నిమ్మ కాయలకు డిమాండ్ తగ్గడం కూడా కారణంగా పేర్కొంటున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఏటా పండ్ల తోటల రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లాలో నిమ్మ తోటల సాగు అధికంగా ఉన్నందున మార్కెట్‌లో ధర లేని సమయంలో నిమ్మ కాయలను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఈ ప్రాంతంలో నిమ్మ ఆధారిత పరిశ్రమ ఏర్పాటుపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలి. గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

# నిబంధనలకు నీళ్లు.. అక్రమ నిర్మాణాలు



నిర్మల్ :జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. పల్లె ప్రజలు పట్నం'దారి' పట్టడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. భవన నిర్మాణ అనుమతి విషయంలో ప్రభుత్వం టీఎస్-బీపాస్ అమలులోకి తీసుకొచ్చినా.. అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఫిర్యాదులు వచ్చిన వాటిపై దృష్టి సారిస్తున్న 'పుర' అధికారులు మిగతా వాటిని పట్టించుకోవడం లేదు. ఇళ్ల అనుమతుల పరిశీలనకు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండటంతో ఈ అనుమతి లేని నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతుల నిబంధనలు కఠినతరం చేయడంతో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ చేయడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకురావడం లేదు.

# మరమ్మతులతోనే చివరికి నీరు.....

**సారంగాపూర్ :** చివరి తడులు చివరి గ్రామాల వరకు నీరు చేరకపోవడంతో చేతికందే సమయంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధాన కాలువలతోపాటు ఉప కాలువల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సారంగాపూర్ మండలంలోని 12ఎల్‌కు రెండు ప్రాంతాల్లో, 1ఆర్ మూడు ప్రాంతాల్లో, బీర్‌పూర్ మండలంలోని చర్లపల్లి, ఆర్‌వీ మెయిన్ కాలువలు పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. అంతేకాకుండా కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోవడమే కాకుండా అనేక ప్రాంతాల్లో సిమెంట్ లైనింగ్‌తోపాటు కాలువలు కూలిపోయినప్పటికీ మరమ్మతు చేపట్టడంలేదు. అలాగే ప్రతి తూము వద్ద గతంలో షట్టర్లు ఉంటుండగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దాదాపు అన్ని తూములకు షట్టర్లు లేకుండా పోయాయి. దీనివల్ల యాసంగి పంట సాగు సమయంలో పైప్రాంతంలో నీరు వృథాగా పోతుండగా కింది ఆయకట్టు రైతులకు నీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి పంటలకు సాగునీటి విడుదల ప్రారంభం కాకపోవడంతో కాలువల్లోని పూడిక మట్టి, పిచ్చిమొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగిస్తే చివరి వరకు నీరు చేరుకునే అవకాశముంది.



# కడుపు నిండినప్పుడు కూడా మీకు ఆకలిగా అనిపిస్తుందా? అయితే జాగ్రత్త!



మీ కడుపు నిండినప్పటికీ మీకు ఆకలిగా అనిపిస్తే, జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే అవసరానికి మించి తినడం, కేవలం అన్ని వేళలా తినడం తీవ్రమైన వ్యాధికి సంకేతం. దీనిని బింజ్ ఈటింగ్ డిజార్డర్ అని కూడా అంటారు. ఇది మానసిక అలవాటు. ఇది సమయానికి చికిత్స పొందడం చాలా ముఖ్యం. మీకు కూడా ఇలాంటి అలవాటు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే సకాలంలో చికిత్స చేయకపోతే ఇది చాలా తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. బింజ్ ఈటింగ్ డిజార్డర్ అంటే ఏమిటి? అది ఎలాంటి తీవ్రమైన వ్యాధులను కలిగిస్తుందో చూద్దాం. చాలా మంది వారాంతాల్లో లేదా ఏదైనా ప్రత్యేక సందర్భంలో ఎక్కువ తింటారు. అయితే, ఇది అతిగా తినే రుగ్మత కిందకు రాదు. ఇలా నిరంతరం జరుగుతుంటే ఆందోళన చెందాల్సిన విషయమే. అతిగా తినే రుగ్మతకు గురైన తర్వాత, తినడం నియంత్రించడం అంత సులభం కాదు. ఆహారం తిన్న కొద్దిసేపటికే ఏదో తినాలని అనిపించడం మొదలవుతుంది. అతిగా తినే అలవాటు ఉన్న వ్యక్తి అధిక బరువు లేదా ఊబకాయం సాధారణ లక్షణాలను కలిగి ఉండవచ్చు. నిర్ణీత సమయంలో అంటే దాదాపు 2 గంటలలోపు ఎక్కువ ఆహారం తీసుకోవడం. తినాలనే కోరికపై నియంత్రణ లేకపోవడం. తినే సమయంలో ఏం జరుగుతుందోననే విషయం పట్టించుకోకపోవడం. కడుపు నిండుగా ఉన్నా తినడం అతిగా తినే అలవాటుకు ప్రతికూలతలు అతిగా తిన్న తర్వాత వాంతులు, విరేచనాలు. అతిగా తినే అలవాటుకు గురైన వ్యక్తి గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఊబకాయం, అధిక కొవ్వు కారణంగా స్ట్రోక్, గుండెపోటు ప్రమాదం.

# పరగడుపున తేనెలో నానబెట్టిన వెల్లుల్లి తింటే శరీరంలో ఏమి జరుగుతుందో తెలుసా..?



ఈ మధ్య కాలంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవటానికి ఇంటిలో సహజసిద్ధంగా దొరికే పదార్థాలను ఉపయోగించవచ్చు. ముఖ్యంగా ఈ సీజన్ లో వచ్చే సమస్యలను తగ్గించటానికి తేనె, వెల్లుల్లి చాలా అద్భుతంగా పనిచేస్తాయి. వెల్లుల్లి, తేనె రెండు మన ఆరోగ్యానికి ఎంతో మేలును చేస్తాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. అదే వెల్లుల్లి, తేనె కలిపి తీసుకుంటే ఊహించని ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లి, తేనె మిశ్రమం ఎలా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ఏ సమయంలో తీసుకుంటే మంచిదో చూద్దాం. ఉదయం పరగడుపున తీసుకుంటే మంచిది. అయితే గ్యాస్ సమస్య ఉన్నవారు పరగడుపున అసలు తీసుకోకూడదు. గ్యాస్ సమస్య ఉన్నవారు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అయ్యిన అరగంట తర్వాత తీసుకోవచ్చు. వెల్లుల్లి, తేనె రెండూ పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. దీని వల్ల మన శరీరం ఎలాంటి వ్యాధినైనా తట్టుకోగలిగే విధంగా రూపు దిద్దుకుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ మరింత పటిష్టమవుతుంది. ప్రధానంగా బాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు. వెల్లుల్లి, తేనె మిశ్రమం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టకుండా చూస్తుంది. పేరుకుపోయే కొవ్వును కూడా తొలగిస్తుంది. దీంతో వివిధ రకాల గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా వెల్లుల్లి, తేనె మిశ్రమంలో ఉన్నాయి. దీంతో ఇది శరీరంలో ఏర్పడే నొప్పులు, వాపులను తగ్గిస్తుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలు దూరమవుతాయి. డయేరియా, అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను నయం చేసుకోవచ్చు. పెద్ద పేగులో ఏర్పడే ఇన్‌ఫెక్షన్లకు అడ్డుకట్ట వేయవచ్చు. జలుబు, ఫ్లూ జ్వరం, సైనస్ వంటి అనారోగ్యాలను నయం చేసుకోవచ్చు. ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. దెబ్బలు, కాలిన గాయాలు, పుండ్లు వంటివి వెంటనే తగ్గిపోతాయి. శ్వాస కోశ సమస్యలతో బాధ పడుతున్న వారికి ఉపశమనం లభిస్తుంది.


# పండ్లు, పండ్ల రసాల్లో ఆరోగ్యానికి ఏది మేలు..!



**న్యూఢిల్లీ :** శరీరానికి పండ్లు తక్షణ శక్తిని అందించి ఉత్సాహంగా పనిచేసేందుకు ఉపకరిస్తాయి. అయితే ఆరోగ్య ప్రయోజనాల కోసం పండ్ల రసాలను తీసుకోవాలా నేరుగా పండ్లను తీసుకోవాలా అనే సందేహాలు చాలా మందిలో వ్యక్తమవుతుంటాయి. పండ్ల రసాల్లో విటమిన్లు, ప్లాంట్ కెమికల్స్ ఉన్నా ఫైబర్, పండ్లలో ఉండే ఇతర పోషకాలు జ్యూస్‌ల్లో లభించవు. పండ్లలో ఉండే డైటరీ ఫైబర్ రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ తగ్గించడంతో పాటు హృద్రోగ ముప్పును తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఫ్రూట్ జ్యూస్‌ల్లో ఫైబర్ లేకపోవడం ప్రధాన లోపం. ఫైబర్ అధికంగా ఉండే పండ్లు తీసుకుంటే మలబద్ధకం నివారించడంతో పాటు తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కలగడంతో బరువు పెరిగే సమస్య తలెత్తదు. ఆపై ఫైబర్‌తో కూడిన పండ్లతో ప్రేవుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇక పండ్లతో పోలిస్తే ఫ్రూట్ జ్యూస్‌లో అధిక క్యాలరీలతో పాటు అధిక షుగర్ ఉంటుంది. దీంతో ఫ్రూట్ జ్యూస్‌లతో రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగడంతో పాటు బరువు పెరిగే అవకాశం ఉంది. ఫ్రూట్ జ్యూస్ తీసుకుంటే ఫైబర్ లేని అధిక క్యాలరీలు శరీరంలోకి తీసుకున్నట్టేనని ప్రముఖ పోషకాహార నిపుణులు లవ్‌నీత్ బాత్రా చెబుతున్నారు. ఇక పండ్ల రసాల కంటే పండ్ల ముక్కలు తీసుకుంటే ఫైబర్‌తో పాటు సూక్ష్మపోషకాలు, బయోయాక్టివ్ పదార్థాలు శరీరానికి మేలు చేస్తాయని చెప్పారు. ఫ్రూట్స్‌తో ఫైబర్ తగినంత లభిస్తుందని బ్లడ్ షుగర్ లెవెల్స్ మెరుగై, సమతులాహారం శరీరానికి లభిస్తుందని ఇన్‌స్టాగ్రాం రీల్‌లో ఆమె పేర్కొన్నారు.

# శీతాకాలంలో బరువు పెరుగుతున్నారా...!

## ఈ సింపుల్ టిప్స్ పాటించి చూడండి



శీతాకాలంలో సహజంగా చాలా మంది బరువు పెరుగుతూ ఉంటారు. దీంతో తమ బరువును తగ్గించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతూ ఉంటారు. చలికాలంలో శరీరం సహజంగా అధిక క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్నటువంటి ఆహారాలను కోరుకుంటుంది. దానికి తోడు ఎండ తీవ్రత కూడా తక్కువగా ఉండడం వలన మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. ఈ సీజన్ సీజనల్ ఎఫెక్టివ్ డిసార్డర్ అనే పరిస్థితికి దారితీస్తుంది. అదృష్టవశాత్తు కొన్ని చర్యలు తీసుకోవడం వలన దీని నివారించడానికి సహాయపడుతుంది. కనుక శీతాకాలంలో బరువుని ఏవిధంగా తగ్గించుకోవాలో ఈ రోజు తెలుసుకుందాం.. చలికాలంలో కూడా వాకింగ్ లేదా జాగింగ్ లాంటి వ్యాయామాలు చేయాలి. ఈ చర్యలు జీవితంలో భాగమై ఉండాలి. యోగ చేయాలనుకుంటే బయటకు వెళ్ళడానికి వీలు లేకపోతే.. ఇంట్లోనే ఉండి యోగ చేస్తున్నటువంటి వీడియోలను చూసి అయినా వ్యాయామం చేయాలి. దీని వలన శరీరంలో ఉన్నటువంటి కండరాలు కదిలి ఉత్సాహాన్నిస్తాయి. పనులు చాలా చురుగ్గా చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ వింటర్ సీజన్లో మరీ ముఖ్యమైంది మనం తీసుకునే ఆహారం. షుగర్ , కొవ్వు ఎక్కువ మోతాదు కలిగిన పదార్థాలు, డీప్ ఫ్రై వంటి ఆహారాలను పక్కకు పెట్టి.. తాజా కూరగాయలు, పండ్లు, తక్కువ కొలెస్ట్రాల్ కలిగి నటువంటి పదార్థాలను తీసుకోవడం ఉత్తమం. దీనివలన బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యమైన ఆహార పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. కనుక తినే తిండి పదార్థాల విషయంలో ఈ చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా చెబుతున్నారు. తినే సమయంలో తిండి పై దృష్టి పెట్టడం చాలా మంచిదని చెబుతున్నారు వైద్యులు. మొబైల్ ఫోన్స్ , టీవీ చూస్తూ తినడం వలన ఎక్కువగా తినడానికి ఆస్కారం ఉంటుంది. అందువలన తినే సమయంలో ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి. తినేటటువంటి తిండి శరీరాన్ని కి బలం చేకురేలా ఉండాలి. ఈ చలి కాలంలో దాహం వేయనప్పటికీ రోజంతా పుష్కలంగా నీరు త్రాగాలి. చల్లని వాతావరణంలో హైడ్రేటెడ్ గా ఉండటానికి హెర్బల్ టీ లేదా వెచ్చని నిమ్మకాయ నీరు వంటి వెచ్చని పానీయాలను ఎంచుకోండి. సరైన ఆర్ద్రీకరణ జీర్ణక్రియలో సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన చర్మానికి మద్దతు ఇస్తుంది. శారీరక పనితీరును మెరుగుపరుస్తుంది. అంతేకాదు నిద్రను కూడా ప్రశాంతంగా నిద్ర పోవాలి.. రాత్రి 7:00 నుండి 9 గంటల ప్రాంతంలో పడుకునే విధంగా టైమును కేటాయించుకోవాలి. ఆ సమయంలో పడుకుంటే తగినంత నిద్రతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి ఉంటుంది.


# మిల్లెట్స్ ఎవరైనా తినొచ్చా? ఈ విషయాలు తెలుసుకోండి....!



సాధారణంగా ప్రతి మనిషికి రోజుకి 38 గ్రాముల ఫైబర్ కావాలి. సిరిధాన్యాలు లేదా మిల్లెట్స్.. ఎక్కువ ఫైబర్ కలిగి ఉండే ఫుడ్స్. అందుకే మిల్లెట్స్ తింటే రోజుకు అవసరమయ్యే ఫైబర్ లభిస్తుంది. అలాగే వీటిలో ఐరన్, క్యాల్షియం, పొటాషియం, జింక్, మెగ్నీషియం, సెలీనియం, సోడియం వంటి ఖనిజాలతో పాటు 12 శాతం ప్రోటీన్ కూడా ఉంటుంది. ఒక కప్పు సిరి ధాన్యాల నుంచి రోజుకు అవసరమైన మాంగనీస్ 33%, ట్రిప్టోఫాన్ 32%, మెగ్నీషియం 27%, ఫాస్ఫరస్ 24% లభిస్తా యి. వరి, గోధుమల కన్నా ఎన్నో రెట్లు అధికమైన పోషక విలువలు వీటిలో ఉంటాయి. మిల్లెట్స్..కొద్దికొద్దిగా చిన్న మొత్తాలలో గ్లూకోజ్‌ని రక్తంలోకి వదులుతాయి. అంతేకాకుండా కొన్ని రకాల చర్మ రోగాలకు, కిడ్నీ సమస్యలకు, బీపీ, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్తమాను నివారించడంలో కూడా దోహదపడుతాయి. కాబట్టి వీటిని ఎవరైనా తినొచ్చు. సాధారణంగా ఇవి పడకపోవడం అంటూ ఉండదు. రెగ్యులర్‌గా తినే అన్నం నుంచి వీటికి మారడం వల్ల కొంతమందికి జీర్ణం అవ్వడం కష్టం గా ఉండొచ్చు. డయేరియా ఉన్న వారికి ఒక్కోసారి పడకపోవచ్చు. స్కిన్ ఎలర్జీస్ ఉన్నవారికి కూడా కొన్నిసార్లు ఇవి పడకపోవచ్చు. అలాంటి వాళ్లు రెండు రోజులకొకసారి, వారానికొకసారో తినడం మంచిది.

# చలికాలంలో ఇవి తింటున్నారా...?

## అద్భుతమైన ప్రయోజనం



చలికాలంలో ప్రజలు ఆకుకూరలను వేడి వేడిగా వండుకుని తినడానికి ఇష్టపడతారు. ఉత్తర భారతదేశంలో అన్నం శనగపప్పుతో తింటారు. అలాగే కొన్ని చోట్ల పచ్చిమిర్చి, మిల్లెట్ రోటీని తింటారు. ఇది రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా చలికాలంలో శరీర అవసరాలను తీర్చే అనేక గుణాలు, పోషకాలు శనగపప్పులో ఉన్నాయి. పప్పుకూరలు తినడం ద్వారా మన శరీరం లోపలి నుండి వెచ్చగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి మనలను కాపాడుతుంది. అంతే కాకుండా శనగలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్, విటమిన్ సి, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఆకుకూరలు తినడం వల్ల ఏయే వ్యాధులు నయమవుతాయో తెలుసుకుందాం. పీచు, ప్రొటీన్లు పచ్చిమిర్చిలో సమృద్ధిగా లభిస్తాయి. ఇది మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయప డుతుంది. పచ్చిమిర్చిలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది పేగు కార్యకలాపాలను నిర్వహించడంలో, మలబద్ధకం సమస్యను తగ్గిం చడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా పచ్చిమిర్చిలో ప్రొటీన్లు కూడా పుష్కలంగా లభించడం వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఆకుకూరల్లో విటమిన్ సి అనే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేసే యాంటీ ఆక్సిడెంట్లు. విటమిన్ సి చాలా ముఖ్యమైన పోషకం. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరం అంటువ్యాధులు, వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు శరీరం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి కూడా పని చేస్తాయి.

# ఎండు ద్రాక్ష నమ్మలేని నిజాలు.....!



మన శరీరంలో రక్తం తగ్గినప్పుడు కొందరు ద్రాక్ష రసాన్ని తాగమని చెబుతూ ఉంటారు. అయితే అన్నిసార్లు ద్రాక్ష రసాన్ని తీసుకోవడం లేదా అన్ని వేళల్లో తీసుకోవడం కొంతమందికి కుదరకపోవచ్చు.. మరికొందరికి ద్రాక్ష రసం కూడా పడదు.. అలాంటి వాళ్ళు ఎండు ద్రాక్ష తినడానికి మొగ్గు చూపుతారు. నిజానికి ఎండు ద్రాక్షల్లో మన ఆరోగ్యానికి ఉపయోగపడే ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. అయితే వాటిని ఎలా తీసుకోవాలి. రోజుకి ఎంత మోతాదులో తీసుకోవాలి. ప్రతిరోజు ఎండు ద్రాక్ష తీసుకోవడం వల్ల మన శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయి అని పూర్తి వివరాలు చూద్దాం.. ఎండు ద్రాక్షాలు ఒక బెస్ట్ ఆంటీ ఆక్సిడెంట్ గా పని చేస్తాయి. ఇంకా ఈ ఎండు ద్రాక్షాలను పరిమితంగా తింటే ఫ్యాట్ కొలెస్ట్రాల వంటి సమస్యలు కూడా దరిచెరవు. ఎండు ద్రాక్షాలు అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎండు ద్రాక్షాలు ఐరన్ పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అంతేకాదు ఎండు ద్రాక్షాలు నేచురల్ షుగర్స్ అత్యద్భుతంగా ఉన్నాయి. ఎండు ద్రాక్షలో కూడా వివిధ రకాలు ఉంటాయి. వాటిలో గోల్డెన్ కలర్ వి గ్రీన్ కలర్ వి అలాగే బ్లాక్ కలర్ వి ఇలా దొరుకుతూ ఉంటాయి.

మీరు ఏది తీసుకున్నా పోషకాలు ఒకేలా ఉంటాయి. ఈ ఎండుద్రాక్ష తీసుకోవడం వల్ల కార్బోహైడ్రేట్లు నాచురల్ షుగర్లతో ఎండు ద్రాక్షాలో నిండు ఉంటాయి. కాబట్టి ప్రతిరోజు కొన్ని ఎండు ద్రాక్షాలు తినడం వల్ల మన శరీరానికి కావాల్సినంత శక్తి అందుతుంది. అంటే ఇన్స్టెంట్గా శక్తి వస్తుంది. ఇక బరువు తగ్గాలి అనుకునే వారికి ఎండు ద్రాక్షాలు మంచి ఆప్షన్ ఇవి ప్రతిరోజు తింటే బరువు తగ్గుతారు.

# పుష్ప-2 గురించి రోజుకో సంచలన వార్త

సమంత తరహాలో జాన్వీ ఎంట్రీ సాంగ్ పుష్ప-2 గురించి రోజుకోవార్త సంచలనం కలిగిస్తోంది. ఇప్పుడీ సినిమా విడుదల కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మరోవార్త సంచలనంగా మారింది. అతిలోక సుందరి తనయ జాన్వీ కపూర్ 'పుష్ప-2'లో మెరవనుందని అంటున్నారు. బన్నీతో ఆడిపాడి



అలరించనుందా అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. అధికారిక ప్రకటన రాలేదు కానీ ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ వార్త విపరీతంగా వైరల్ అవుతోంది. 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావా...' అంటూ పాట ఎంత ఊపు ఊపిందో తెలిసిందే. అందులో సమంత చేసిన అందాల సందడి అంతా ఇంతా కాదు. 'పుష్ప 2'లో కూడా ఆ తరహాలోనే ఓ ప్రత్యేక గీతం

ఉంటుందని మొదటి నుంచి టాక్ నడుస్తోంది. ఇప్పటిదాకా పలువురి బాలీవుడ్ తారల పేర్లు వినిపించాయి. తాజాగా జాన్వీ కపూర్ పేరు బలంగా వినిపిస్తోంది. పుష్పరాజ్ పక్కన జాన్వీ కాలు కదపడానికి రెడీ అవుతోందని తెలుస్తోంది. మరి ఈ ప్రత్యేక గీతంలో ఆడి పాడడానికి సై అన్నారా? లేదా అన్న విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికే జాన్వీ తెలుగులో రెండు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతోపాటు రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో కూడా జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోన్న సంగతి తెలిసిందే! చరణ్ సినిమా వేసవిలో ప్రారంభం కానుంది. 'పుష్ప 2'లో ప్రత్యేక గీతానికి జాన్వీ 'ఊ' అంటే టాలీవుడ్ స్టార్స్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్‌లతో కలిసి నటించిన కథానాయిక అవుతుంది జాన్వీ.





# కలియుగం పట్టణంలో కొత్త తరం మూవీ

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా 'కలియుగం పట్టణంలో' అనే ఓ డిఫరెంట్ మూవీ రాబోతోంది. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి చూసుకుంటున్నారు.

రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. మార్చి 22న రాబోతోన్న ఈ మూవీలో చిత్రా శుక్లా ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఇక ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆ నలుగురు సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడని.. ఇప్పుడు హీరోగా నటించాడన్నారు. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోందని.. కలియుగం పట్టణంలో అనే టైటిలే చాలా వినూత్నంగా ఉందన్నారు. మార్చి 22న ఈ చిత్రం రాబోతోందని.. ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. డైరెక్టర్ త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ.. 'కలియుగం పట్టణంలో టీజర్ నాకు చూపించారు

నాకు చాలా నచ్చింది. ఏదో చిన్న సినిమాలా అనుకున్నా.. కానీ హై స్టాండర్డ్‌లా అనిపించింది.విశ్వ కార్తికేయ, ఆయుషి జంట చక్కగా ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ ఇవ్వాలి. దర్శక నిర్మాతలకు మంచి పేరు రావాలి.' అని అన్నారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా కలియుగం పట్టణంలో సినిమాను ఆశీర్వదించడానికి వచ్చిన మీడియాకు థాంక్స్. నా సినిమా టీంకు థాంక్స్. మిగతా విషయాలన్నీ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడతాను' అని అన్నారు.





# ఓటిటిలోకి వస్తోన్న హనుమాన్

టాలీవుడ్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ హనుమాన్ మహా శివరాత్రి కానుకగా మార్చి 08 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ఎక్స్‌లో ప్రకటించింది.. తేజ సజ్జా కథా నాయకుడిగా నటించిన ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టింది. ఇదిలావుంటే ఈ మూవీ ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే వారికి గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. హనుమాన్ మూవీ తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 వేదికగా ఈ చిత్రం ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అది అంజనాద్రి అనే ఊహ ప్రాంతం. ఆ వూర్లో హనుమంతు (తేజాసజ్జా) ఒక మామూలు కుర్రాడు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ సరదాగా కాలం గడిపేస్తుంటాడు. అనుకోని సంఘటనతో హనుమంతుకి కొన్ని అతీత శక్తులు వస్తాయి. ఆ శక్తుల గురించి తెలుసుకున్న మైఖేల్ (వినయ్‌రాయ్) అంజనాద్రి వస్తాడు. హనుమంతు వద్ద శక్తులని తన వశం చేసుకొని ప్రపంచంలోనే అత్యంత శక్తివంతుడు కావాలనుకుంటాడు. మరా ఆ శక్తిని వశం చేసుకోవడానికి మైఖేల్ ఏం చేశాడు? మైఖేల్ వలన అంజనాద్రికి ఎలాంటి ముప్పు వాటిల్లింది ? హనుమంతు మైఖేల్ ని ఎలా అడ్డురుకున్నాడు ? అనేది తెరపై చూడాలి.మరోవైపు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించిన విషయం తెలిసిందే. 'హనుమాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్ కు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమయిపోయిందని ప్రశాంత్ వర్మ వెల్లడించాడు.

# వైమానిక దళ ఆపరేషన్ ఆధారంగా ఆపరేషన్ వాలెంటైన్

తెలుగులో ఎయిర్ ఫోర్స్ యుద్ధం నేపథ్యంలో సినిమాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు వరుణ్ తేజ్ ఈ యుద్ధ నేపథ్యంలో 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చాడు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాతో వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్నాడు. మానుషి చిల్లర్ ఇందులో కథానాయక. ఈ సినిమాలో హిందీ తెలుగు నటులు మిశ్రమంగా కనిపిస్తారు. అర్జున్ రుద్ర దేవ్ అలియాస్ రుద్ర భారత వైమానిక దళంలో స్క్వాడ్రన్ లీడర్, యుద్ధ పైలట్ కూడా. ధైర్య సాహసాలకు పెట్టింది పేరు, దానివలన అప్పుడప్పుడు పై అధికారులతో చివాట్లు కూడా తింటూ ఉంటాడు. అతని ప్రియురాలు అహన (మానుషి చిల్లర్) రాడార్ ఆపరేటర్ గా వైమానిక దళంలోనే పనిచేస్తూ ఉంటుంది. అర్జున్ ప్రాజెక్ట్ వజ్ర సరిగా పని చేస్తోందో లేదో అని టెస్ట్ చేసే సమయంలో అతని మిత్రుడు (నవదీప్) ని కోల్పోతాడు. ఆ తరువాత పాకిస్తాన్ కి చెందిన టెర్రరిస్టులు భారత సైనికులను తీసుకు వెళుతున్న ట్రక్కులపై దాడి చేస్తారు, ఇందులో 40 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోతారు. దీనికి ప్రతిగా భారత వైమానిక దళం ఒక ఆపరేషన్ ప్లాన్ చేస్తుంది. ఏంటి ఆ ఆపరేషన్, అది ఎలా అమలు చేస్తారు, వజ్ర ప్రాజెక్ట్ నేపథ్యం ఏంటివన్నీ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాగా మలిచారు. ఈ కథ నిజ సంఘటనల ఆధారంగా తీసిన కథ. పాకిస్తాన్ టెర్రరిస్టులు జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా దాడిలో 40 మంది భారత సైనికులను పొట్టను పెట్టుకున్న ఉదంతం అందరికీ తెలిసినదే. దానికి ప్రతిగా భారత వైమానిక దళం పాకిస్థాన్లోని టెర్రరిస్ట్ క్యాంపులను విచ్ఛిన్నం చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా ఈ కథ ఆ సంఘటన ఆధారంగా తీసుకున్నదే. అయితే తెలుగులో ఇలాంటి యుద్ధ నేపథ్యం ఉన్న సినిమా రావటం ఇదే మొదటిసారి. ఇలాంటి సినిమాలు చేయాలంటే చాలా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవసరం, ప్రేక్షకులకి నమ్మించే విధంగా కూడా ఉండాలి, అలాంటి సన్నివేశాలు కూడా చూపించగలగాలి. ఇవన్నీ కాకుండా దేశభక్తి అనే భావోద్వేగంతో పాటు మనుషుల మధ్య కూడా ఆ భావోద్వేగాలు కనిపించాలి. అప్పుడే ఈ తరహా సినిమాలు విజయం సాధిస్తాయి. ఇక ఈ ఆపరేషన్ వాలెంటైన్ సినిమాకు వస్తే దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ తన పరిధి మేరకు చేసాడు అని చెప్పొచ్చు, అక్కడక్కడ చిన్న చిన్న లోటుపాట్లు వున్నా తెలుగు సినిమాలో ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా తీయడం హర్షించదగ్గ విషయమే. ఇంతకుముందు హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన 'ఫైటర్' సినిమా కూడా ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా అవడం ఆసక్తికరం. ఇప్పుడు ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమా కూడా అదే నేపద్యంలో వచ్చింది. ఇందులో దేశభక్తి




కనిపిస్తుంది కానీ సినిమాలో భావోద్వేగాలు అంతగా కనిపించవు, కొన్ని దగ్గర్ల మరీ గ్రాఫిక్స్ అని అర్థం అయిపోతుంది. ఇది వ్యాపారాత్మకంగా నడుస్తుందా నడవదా అన్న విషయాన్ని పక్కన పెడితే వరుణ్ తేజ్ లాంటి నటుడు ఇలాంటి సినిమాతో ముందుకు రావడం హర్షణీయం.

# అతి తక్కువ ధరకే 5జీ ఫోన్.. ఫ్లిప్ కార్ట్‌లో అదిరే ఆఫర్.....




ఇటీవల కాలంలో 5జీ స్మార్ట్ ఫోన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఎయిర్ టెల్, జియో వంటి టెలికాం సంస్థలు అన్ని నగరాల్లో 5జీ సేవలను అందుబాటులోకి తేవడంతో అందరూ 5జీ ఫోన్లను కావాలనుకుంటున్నారు. అయితే 5జీ ఫోన్ల రేటు కాస్త ఎక్కువగానే ఉంటున్నాయి. దీంతో తక్కువ ధరలో దొరికే స్మార్ట్ ఫోన్ల కోసం వినియోగదారులు వెతుకుతున్నారు. మీరు కూడా అలాంటి ఫోన్ల కోసమే ఎదురుచూస్తుంటే మీ వెతుకులాటకు ఇక ఫుల్ స్టాప్ పెట్టేయొచ్చు. శామ్సంగ్ గెలాక్సీ నుంచి ఓ 5జీ ఫోన్ అనువైన ధరలో అందుబాటులో ఉంది. పైగా దానిపై పలు ఆఫర్లు కూడా ఉన్నాయి. ఆ స్మార్ట్ ఫోన్ మోడల్ పేరు శామ్సంగ్ గెలాక్సీ ఎఫ్14 5జీ. ఈ శామ్సంగ్ 5జీ స్మార్ట్ ఫోన్ కు సంబంధించిన స్పెసిఫికేషన్లు, ఫీచర్లు, అందుబాటులో ఉన్న డిస్కౌంట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. శామ్సంగ్ గెలాక్సీ ఎఫ్14 5జీ ఫోన్ అత్యల్ప ధరకు అందుబాటులో ఉంది. ఇది అధిక ధర కలిగిన శామ్సంగ్ గెలాక్సీ ఎం14 5జీలో ఉన్న అవే ఫీచర్లు ఉంటాయి. అయితే దీనికి దానికి ఉన్న ఒకే ఒక్క తేడా కెమెరా. ఎం సిరీస్ లో అధిక రిజల్యూషన్ ఉన్న కెమెరా ఉంటుంది. కాగా ఎఫ్14 5జీ ఫోన్ పై ప్రముఖ ఈ కామర్స్ సైట్ ఫ్లిప్‌కార్ట్ లో ప్రత్యేక ఆఫర్ లభిస్తోంది. ఫ్లిప్ కార్ట్ ఇయర్ ఎండ్ సేల్ లో భాగంగా ఈ శామ్సంగ్ గెలాక్సీ ఎఫ్14 ను రూ. 11,490కి కొనుగోలు చేయొచ్చు. అంతేకాక కొన్ని బ్యాంక్ ఆఫర్‌లు ఉన్నాయి. అవన్నీ కలిపితే దీనిని కేవలం రూ. 10,000కే కొనుగోలు చేయొచ్చు. శామ్సంగ్ గెలాక్సీ ఎఫ్14 5జీ ఫోన్ ధర రూ. 11,490గా ఉంది. వాస్తవానికి ఈ ఫోన్ ప్రారంభ ధర రూ. 12,990గా ఉండింది. అంటే వినియోగదారులు దీనిపై ఫ్లాట్ రూ. 1,500 డిస్కౌంట్ లభిస్తోంది. దీనికి అదనంగా కొన్ని బ్యాంకు కార్డులపై అదనంగా 10శాతం తగ్గింపు కూడా లభిస్తుంది. ఈ ఆఫర్ కూడా కలుపుకుంటే ఇంకా తగ్గుతుంది. మీరు కనుక 5జీ స్మార్ట్ ఫోన్ తక్కువ ధరకే కావాలనుకుంటే మాత్రం ఇదే బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. ఇది మీ అంచనాలకు అనుగుణంగా ఉంటుంది. దీనిలో సైడ్-మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సార్ కూడా ఉంటుంది. అలాగే దీనిలో అధిక సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఉంటుంది. 6,000ఎంఏహెచ్ బ్యాటరీ ఉంటుంది.

# రూ. 1500కే బ్లూటూత్ కాలింగ్ ఫీచర్...

## బోల్ట్ నుంచి మరో స్మార్ట్ వాచ్

ప్రస్తుతం మార్కెట్లో స్మార్ట్ వాచ్‌లకు గిరాకీ భారీగా పెరిగింది. ఒకప్పుడు అధిక ధరలు పలికిన స్మార్ట్ వాచ్‌ల ధరలు ఇప్పుడు కంపెనీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో భారీగా తగ్గుముఖం పట్టాయి. బడ్జెట్ ధరలోనే అధునాతన ఫీచర్లతో కూడిన స్మార్ట్ వాచ్‌లు మార్కెట్లోకి వస్తున్నాయి. తాజాగా ఈ క్రమంలో ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థ ఫైర్ బోల్ట్ కొత్త వాచ్‌ను లాంచ్ చేసింది. ఫైర్ బోల్ట్ ఆర్మర్ పేరుతో ఈ స్మార్ట్ వాచ్‌ను తాజాగా మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఈ స్మార్ట్ వాచ్‌లో ఎలాంటి ఫీచర్లు ఉన్నాయి.? ధర ఎంత.? లాంటి పూపర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఫైర్ బోల్ట్ ఆర్మర్ స్మార్ట్ వాచ్‌లో 1.6 ఇంచెస్‌తో కూడిన డిస్‌ప్లేను అందించారు. ఈ డిస్‌ప్లే గరిష్టంగా 600 నిట్స్ బ్రైట్‌నెస్‌ను విడుదల చేస్తుంది. ఇక 400%*%400 ఈ స్మార్ట్ వాచ్ స్క్రీన్ సొంతం. ఈ వాచ్‌లో బ్లూటూత్ కాలింగ్ ఫీచర్‌ను అందించారు. ఇందుకోసం ఇన్‌బుల్ట్‌గా స్పీకర్‌ను అందించారు. ఇక ఈ వాచ్ ధర విషయానికొస్తే రూ. 1499గా నిర్ణయించారు. ఫైర్ బోల్ట్ ఆర్మర్ స్మార్ట్ వాచ్‌ను బ్లాక్, కామో బ్లాక్, గ్రీన్, గోల్డ్ బ్లాక్, సిల్వర్, గ్రీన్ కలర్స్‌లో తీసుకొచ్చారు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు, ఈ కామర్స్ సైట్ అమెజాన్‌లోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ స్మార్ట్‌వాచ్‌లో సర్క్యులర్ డయల్‌ను అందించారు. నావిగేషన్ కోసం క్రౌన్ బటన్‌ను సైడ్‌కు అందించారు. ఇన్‌బిల్ట్ మైక్రోఫోన్, స్పీకర్‌తో నేరుగా వాచ్‌లో ఫోన్ మాట్లాడుకోవచ్చు. వాయిస్ అసిస్టెంట్ ఫంక్షన్‌ను ఇందులో అందించారు. ఇక ఈ వాచ్‌లో హృదయ స్పందన రేటు, స్లీప్ ట్రాకింగ్, ఎస్‌పీఓ2 స్థాయి వంటి హెల్త్ ఫీచర్లు కూడా ఉన్నాయి. ఫైర్ బోల్ట్ ఆర్మర్ వాచ్‌లో 100కు పైగా స్పోర్ట్స్ మోడ్‌లు అందించారు. స్మార్ట్ నోటిఫికేషన్, వెదర్ ఇన్ఫర్మేషన్, కాలిక్యులేటర్, మ్యూజిక్, కెమెరా కంట్రోల్ వంటి ఫీచర్లు ఈ వాచ్ ప్రత్యేకతగా చెప్పొచ్చు. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఇందులో 600 ఎమ్ఏహెచ్ బ్యాటరీని అందించారు. ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే 8 రోజులు పని చేస్తుంది. స్టాండ్‌బైలో 25 రోజులు పనిచేస్తుంది.




# తగ్గిన పసిడి ధరలు..

## కొనుగోలుదారుల్లో చిగురించిన ఆశలు....



బంగారం కొనేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తిచూపిస్తారు. అందున పండుగలు ఏవైనా ప్రత్యేక రోజులు వస్తే చాలు ఎగబడి కొనుగోలు చేస్తారు. అయితే నిన్న మన్నటి వరకూ ఆకాశాన్నంటిన పసిడి ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం కొనుగోలు దారుల్లో ఆశలు చిగురించేలా చేస్తోంది. నిన్నటి వరకూ పరుగులు తీసిన పసిడి ఈరోజు కాస్త తగ్గుముఖం పట్టింది. ద్రవ్యోల్బణంతో పాటూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ గోల్డ్ రిజర్వ్ వడ్డీరేట్లలో వచ్చిన హెచ్చుతగ్గుల కారణంగా స్వల్ప ఊరట కలిగింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో పెట్టుబడులపై కాస్త హెచ్చుతగ్గులు కనిపించాయి. దీని ప్రభావం బంగారు ధరలపై పడింది. నిన్న హైదరాబాద్ మార్కెట్లో 10గ్రాములు 24 క్యారెట్ పసిడి ధర నిన్న రూ.63,000 కాగా ఈరోజు తులంపై రూ.490 తగ్గి రూ. 62,510కి చేరింది . ఇక 10గ్రాములు 22 క్యారెట్ బంగారం ధర నిన్న రూ. 57,750 ఉండగా ఈరోజు రూ. 450 తగ్గి రూ. 57,300 కు చేరింది. ఇక వెండి విషయానికొస్తే నిన్న కిలో రూ. 80,500 కాగా ఈరోజు కిలోపై రూ. 800 తగ్గి 79,700 కు చేరింది. హైదరాబాద్‌తో పాటూ పలు ప్రధాన నగరాల్లో బంగారం,వెండి ధరలు ఎలా ఉందో ఇప్పుడు తెలుసుకుందాం.

10 గ్రాముల 24క్యారెట్ బంగారం ధర
హైదరాబాద్..రూ. 62,510
విజయవాడ..రూ. 62,510
ముంబాయి..రూ. 62,510
బెంగళూరు..రూ. 62,510
చెన్నై..రూ. 63,160

10గ్రాముల 22క్యారెట్ బంగారం ధర
హైదరాబాద్..రూ. 57,300
విజయవాడ..రూ. 57,300
ముంబాయి..రూ. 57,300
బెంగళూరు..రూ. 57,300
చెన్నై..రూ. 57,900

దేశంలోని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధరలు ఇలా..
హైదరాబాద్..రూ. 79,700
విజయవాడ..రూ. 79,700
చెన్నై..రూ. 79,700
ముంబాయి..రూ. 77,700
బెంగళూరు..రూ. 75,500

దీని ప్రభావం బంగారు ధరలపై పడింది. నిన్న హైదరాబాద్ మార్కెట్లో 10గ్రాములు 24 క్యారెట్ పసిడి ధర నిన్న రూ.63,000 కాగా ఈరోజు తులంపై రూ.490 తగ్గి రూ. 62,510కి చేరింది. ఇక 10గ్రాములు 22 క్యారెట్ బంగారం ధర నిన్న రూ. 57,750 ఉండగా ఈరోజు రూ. 450 తగ్గి రూ. 57,300 కు చేరింది. ఇక వెండి విషయానికొస్తే నిన్న కిలో రూ. 80,500 కాగా ఈరోజు కిలోపై రూ. 800 తగ్గి 79,700 కు చేరింది.

# పదేళ్లు మదుపు చేస్తేనే లాభాలు...!

భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటోంది. కంపెనీల ఆదాయాలు బలంగా కొనసాగుతూనే ఉన్నాయి. మార్కెట్‌కు ఇవి మూలాధారాలు. అందుకే, ప్రస్తుతం సూచీల్లో వృద్ధి కనిపిస్తోంది. ఈక్విటీల్లోకి దేశీయ పెట్టుబడిదారుల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. వీటికి అంతర్జాతీయ పెట్టుబడులూ కలుస్తున్నాయి. రాబోయే కాలంలో కొంత అస్థిరత కనిపించే అవకాశాలను తోసిపుచ్చలేం. కానీ, ఇది అంత ప్రతికూల ప్రభావాన్ని చూపకపోవచ్చు. మార్కెట్‌లో ఎప్పుడు పెట్టుబడి పెడుతున్నామ న్నది ముఖ్యం కాదు. ఎంత సమయం కొనసాగుతున్నామన్నదే ఎప్పుడూ విజయాన్ని అందిస్తుంది. మార్కెట్ ఎప్పుడూ కొన్ని దశల్లో ఉంటుంది. పతనం, వృద్ధి అనేది ఇక్కడ సర్వసాధారణం. కనీసం 5 ఏళ్లకు మించి పెట్టుబడులు కొనసాగించాలి. 10 ఏళ్ల దీర్ఘకాలానికి మదుపు చేసినప్పుడే మంచి లాభాలు ఆర్జించేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్న సంగతిని మదుపరులు గుర్తుంచుకోవాలి. భారతీయ ఆర్థిక వ్యవస్థ బలమైన మూలాల్ని మర్చిపోవద్దు. దీర్ఘకాలిక పెట్టుబడుల్లో ఈక్విటీలు ఎప్పుడూ ప్రత్యేకమే. పెట్టుబడిదారులు స్వల్పకాలిక లాభాల కోసం చూడకుండా, సాధ్యమైనంత ఎక్కువ కాలం కొనసాగినప్పుడే మంచి ఫలితాలు అందుకో వచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు ఎప్పుడూ భౌగోళిక, ఆర్థిక అస్థిరతలు ప్రమాదంగానే ఉంటాయి. స్థానికంగా మాత్రమే ప్రభావం చూపే అంశాలకు మార్కెట్లు పెద్దగా స్పందించవు. వీటి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. కొన్ని పరిస్థితుల్లో సూచీల్లో దిద్దుబాటు కనిపిస్తుంటుంది. ఇలాంట ప్పుడు పెట్టుబడి అవకాశాన్ని మార్కెట్ ఇచ్చిందని గమనించాలి. దీర్ఘకాలంలో సంపదను సృష్టించేందుకు మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడులు ఒక మంచి మార్గమని మదుపరులు విశ్వసిస్తున్నారు. కానీ, ఇది అంత ప్రతికూల ప్రభావాన్ని చూపకపోవచ్చు. మార్కెట్‌లో ఎప్పుడు పెట్టుబడి పెడుతున్నామ న్నది ముఖ్యం కాదు. ఎంత సమయం కొనసాగుతున్నామన్నదే ఎప్పుడూ విజయాన్ని అందిస్తుంది. మార్కెట్ ఎప్పుడూ కొన్ని దశల్లో ఉంటుంది. పతనం, వృద్ధి అనేది ఇక్కడ సర్వసాధారణం. కనీసం 5 ఏళ్లకు మించి పెట్టుబడులు కొనసాగించాలి. 10 ఏళ్ల దీర్ఘకాలానికి మదుపు చేసినప్పుడే మంచి లాభాలు ఆర్జించేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్న సంగతిని మదుపరులు గుర్తుంచుకోవాలి.

# ట్రెండీ ఫీచర్లతో పవర్‌ఫుల్ స్మార్ట్‌వాచ్..

## ధర ఎంతంటే..




ఇటీవల కాలంలో స్మార్ట్ వాచ్ ఒక ట్రెండీ గ్యాడ్జెట్ గా మారిపోయింది. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ స్మార్ట్ వాచ్ లను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా అందులో ఉంటున్న ఫిట్ నెస్, హెల్త్ ఫీచర్లు బాగా ఉపయుక్తంగా మారుతున్నాయి. ఈ క్రమంలో అనేక కంపెనీలు స్మార్ట్ వాచ్ లను లాంచ్ చేస్తున్నాయి. వాటిల్లో హోం బ్రాండ్లతో పాటు అనేక ఇంటర్నేషనల్ బ్రాండ్లు కూడా ఉంటున్నప్పటికీ.. ప్రోమేట్ ఎక్స్ వాచ్ బీ2 అనే స్మార్ట్ చాలా కొత్తగా కనిపిస్తోంది. ఇటీవలే లాంచ్ అయిన ఈ కొత్త స్మార్ట్ వాచ్ 2.01 అంగుళాల డిస్ప్లేతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ స్మార్ట్ వాచ్ రూ. 2,499గా ఉంది. ఇంత ధర దీనికి పెట్టొచ్చా? దీనిలోని ప్లస్ లు ఏంటి? మైనలు ఏంటి? ఫీచర్లు ఎలా ఉన్నాయి? తెలుసుకుందాం రండి.. స్మార్ట్ వాచ్ బ్లూ, బ్లాక్ గ్రాఫైట్ రంగుల్లో అందుబాటులో ఉంది.

# ఒక్కసారి ఛార్జ్ చేస్తే 150 కి.మీలు దూసుకుపోవచ్చు..

## కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్



భారత ఆటో మొబైల్ మార్కెట్లోకి 'డాట్ వన్' పేరుతో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను లాంచ్ చేశారు. లాంచింగ్ ఆఫర్‌లో భాగంగా ఈ స్కూటర్‌ను రూ. 99,999గా నిర్ణయించారు. అయితే ముందుస్తుగా బుక్ చేసుకున్న వారికే ఈ ఆఫర్ వర్తిస్తుంది. తర్వాత ధర పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ బుకింగ్స్ ప్రారంభించారు. త్వరలోనే స్కూటర్లను డెలివరీ చేయనున్నారు. ఇక ఈ స్కూటర్ ఫీచర్ల విషయానికొస్తే.. ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ చేస్తే గరిష్టంగా 160 కిమీలు రేంజ్ అందిస్తుందని కంపెనీ చెబుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు, రోడ్డు ఆధారంగా కనీసం 151 కిమీ మైలేజ్ ఇస్తుందని సమాచారం. ఇక ఈ స్కూటర్‌లో 3.7 కిలో వాట్స్ కలిగిన బ్యాటరీని అందించారు. పికప్ విషయంలోనూ ఈ స్కూటర్ మంచి పర్ఫామెన్స్ అందిస్తుందని కంపెనీ చెబుతోంది. కేవలం 2.77 సెకన్లలోనే గంటకు 0 నుంచి 40 కిమీల వరకు వేగాన్ని పుంజుకుంటుంది. ఇందులో అందించిన 8.5 కిలో వాట్ ఎలక్ట్రిక్ మోటర్, 72 న్యూటన్ మీటర్ టార్క్‌ను అందిస్తుంది. డాట్ వన్ స్కూటర్‌లో 35 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్‌ను అందించారు. ఇక డిజైన్ పరంగా కూడా ఈ స్కూటర్‌ను స్పోర్టివ్ లుక్‌లో తీసుకొచ్చారు. ఇందులో 8500 మోటర్ పవర్‌ను అందించారు. 105 కిలోమీటర్ల టాప్ వేగంతో దూసుకుపోతుంది. స్కూటీ 0 నుంచి 80 శాతం ఛార్జింగ్ కావడానికి 3 గంటల 47 నిమిషాలు పడుతుంది.

